
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025 | 5





అప్పుడే.. భగభగ

మండిపడుతున్న భానుడు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భానుడు మండిపడుతున్నాడు..భగభగలాడిపోతున్నాడు.. జనం తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు.. 10 గంటలు దాటిన తరువాత బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ గురువారం ఉష్ణోగ్రతల వివరాలు వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో గురువారం 40.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది.చింతూరులో 38.5 నమోదైంది. శుక్రవారం 38.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. దేవీపట్నంలో 42.5 డిగ్రీలు నమోదు కాగా శుక్రవారం 39.0 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. గంగవరంలో 41.3 డిగ్రీలు నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. రంపచోడవరంలో 41.9 డిగ్రీలు నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో గురువారం 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోకవరంలో 40.0 గోపాలపురంలో 40.0 , కడియంలో 37.0,కోరుకొండలో 40.0, కొవ్వూరులో 39.3, నల్లజర్లలో 39.1 , నిడదవోలులో 39.8, పెరవలిలో 38.3, రాజమహేంద్రవరంలో 39, రూరల్‌లో 38.9, రాజానగరంలో 37.8, రంగంపేటలో 37.2, సీతానగరంలో 40.8, తాళ్ళపూడిలో 40.3, ఉండ్రాజవరంలో 38.9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గనున్నది. కాకినాడ జిల్లా జగ్గంపేటలో 38.0 డిగ్రీలు, కాజులూరులో 37.3, కోటనందూరులో 38.2 , పెద్దాపురంలో 37.8, పిఠాపురంలో 36.7 , సామర్లకోటలో 37.5, తునిలో 38.2, కోనసీమ జిల్లా ఆలమూరులో 37.8 డిగ్రీలు, అంబాజీపేటలో 37.6, ఆత్రేయపురంలో 38.3, కొత్తపేటలో 37.5, పి గన్నవరంలో 37.4, రావులపాలెంలో 37.8డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైంది. శుక్రవారం ఒకటి నుంచి రెండు డిగ్రీల తగ్గే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ స్పష్టం చేసింది.

విషాద..జర్నీ!

మృత్యు శకటం





ప్రమాదంలో తునాతునకలైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

అతి వేగం ప్రమాదం.. అయినా ప్రైవేట్ ట్రావెల్ బస్ డ్రైవర్లు ఎక్కడా తగ్గరు.. వేగంగా దూసుకుపోతారు.. ఎదురుగా ఏం ఉన్నా పట్టించుకోరు..చివరకు బలైపోతారు.. ఏలూరు చొదిమెళ్ల దగ్గర గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదమే అందుకు ఉదాహరణ.. రమణ ట్రావెల్స్ బస్ బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కాకినాడకు 34 మంది ప్రయాణికులతో బయలుదేరింది.. డ్రైవర్ వేగంగా వస్తున్నాడు.. ప్రయాణికులంతా నిద్రలో ఉన్నారు.. రోడ్డు మధ్యలో లారీ రూపంలో మృత్యుశకటం ఆగిపోయింది.. అయినా ప్రైవేట్ బస్ డ్రైవర్ అంచనా వేయలేకపోయాడు.. వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు.. అతివేగం.. నిర్లక్ష్యం డ్రైవర్ సహా ముగ్గురి ప్రాణాలు తీసింది.. వీరిలో కాకినాడ జిల్లాకు చెందిన వారే ముగ్గురు ఉండడం తీవ్ర విషాదంలో నింపింది.

7

స్వగృహమస్తు!



పేదింటికి కూటమి చేయూత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పేదింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. వీరి సొంతింటి కలను తీర్చేందుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పేదలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు 23,359 మంది దరఖాస్తులు గృహనిర్మాణశాఖకు చేరాయి. గడువు ముగియనున్న ఈ నెలాఖరునాటికి మరో పది వేల వరకు వినతులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18 వేలు, తూర్పు గోదావరి జిల్లాలో 10,559, కోనసీమ జిల్లాలో 4,800 వరకు దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఈ నెల 10వ తేదీ నుంచి వడపోత పోయడానికి గృహ నిర్మాణశాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల లబ్ధిదారులుగా ఉన్నట్టు తేలితే అర్హుల జాబితా నుంచి తప్పించనున్నారు. వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో 95 శాతం మందికిపైగా సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారే. ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలాలు ఉన్నట్టు నిర్ధారించేలా ఆయా మండలాల తహశీల్దార్ల నుంచి గృహనిర్మాణశాఖ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు సేకరిస్తున్నారు. మరో పక్క లబ్ధిదారులుగా ఎంపికైన వారి సొంతింటి నిర్మాణానికిప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది.

నాడు పేదల పేరు..దోపిడీ జోరు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పేదలను నిలువునా ముంచేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.06 లక్షల మందిని పేదల ఇళ్లస్థలాలకు అర్హులుగా గుర్తించింది. వీరందరికి 7,610 ఎకరాలు అవసరమవుతాయని నిర్ధారించారు. ఇందులో రెండు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగిలిన 5,610 ఎకరాల ప్రైవేటు భూములను రూ.2,200 కోట్లకుపైగా వెచ్చించి కొనుగోలు చేసింది. ఈ క్రమంలో పేదల ఇళ్లస్థలాలకు అనువైన ప్రాంతాలు కాకుండా కేవలం స్థానిక అధికార పార్టీ నాయకులకు ఆర్థికంగా కలిసి వచ్చే ప్రాంతాలను గుర్తించి వాటిని అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,540 వరకు లేఅవుట్లు వేశారు. ఇందులో వెయ్యికిపైగా లేఅవుట్ల వరకు వర్షాలకు నిండా మునిగిపోయేవే. 150 ఎకరాల కరప సెంట్రల్ లేఅవుట్ దగ్గర నుంచి, జగన్ ప్రారంభించిన కొమరగిరి లేఅవుట్, రాజమహేంద్రవరానికి సమీపంలోని ఆవభూములు ఇలా చాలా వరకూ పనికిరాని లేఅవుట్లు వేశారు. వీటిలోనే లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.అయినా ఆ లేఅవుట్లలో స్థలాలు మాకొద్దంటూ పేదలు భీష్మించడంతో లక్షలాది స్థలాలు ఖాళీగా ఉండిపోయాయి. ఇన్ని చేదు అనుభవాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను నెరవేర్చే విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు కదులుతోంది. దానిలో భాగంగా సొంతిళ్లు కట్టుకోవాలనుకునే లబ్ధిదారులకు ఆర్థికంగా సాయం అందించేందుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుంది.తొలుత సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపింది. సొంత స్థలం లేనివారికి స్థలం సేకరించి ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది.

ఇప్పుడు ఎక్కువ మంది వారే..

కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల ద్వారా అధికారులు సొంతింటి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు చివరలో ప్రారంభించిన ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23,359 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు 18 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,700 మంది వివిధ మునిసిపాలిటీల పరిధిలో దరఖాస్తు చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 10,559 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా నల్లజర్ల మండలంలో 2,396 మంది,గోపాలపురం 1,143, రాజానగరం మండలంలో 1,060 మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెలాఖరు వరకు ఛాన్స్ ఉండడంతో మరో పది వేల వరకు దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో 95 శాతం మంది సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారే.ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలం ఉన్నట్టు ఆయా మండలాల తహశీల్దార్లతో పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్‌ను అధికారులు తీసుకుంటున్నారు.ఇప్పటికే సగం దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ముగిసింది.

- సొంతింటి కోసం దరఖాస్తులు
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో వెల్లువ
- ఇప్పటి వరకు 23,359 దరఖాస్తులు
- 95 శాతం సొంతస్థలం ఉన్నవారే
- సచివాలయాల ద్వారా స్వీకరణ
- ఈ నెలాఖరు వరకు ఛాన్స్
- తహశీల్దార్ల ద్వారా పొజిషన్ సర్టిఫికెట్
- ఈ నెల 10 నుంచి వడపోత
- లబ్ధిదారుకు రూ.2.50 లక్షలు
- గతంలో ఇళ్లు పొందితే ఏరివేత
- సొంత స్థలం లేనివారికి స్థలం

10 నుంచి యాప్ వివరాలు..

ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన యాప్‌లో ఈనెల 10 నుంచి అధికారులు వివరాలు నమోదు చేయనున్నారు. గతంలో వీరు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభుత్వం నుంచి స్థలం లేదా ఇళ్లు పొంది ఉన్నారా?లేదా?అనేది గుర్తించనున్నారు. ఒకవేళ పాత లబ్ధిదారులైతే అర్హుల జాబితా నుంచి తొలగించనున్నారు.మరో పక్క అర్హుల జాబితాకు సంబంధించి వడపోత పూర్తయితే వాటిని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్, పట్టణం, గ్రామీణ ప్రాంతం విభాగంలో అప్‌లోడ్ చేయనున్నారు. లబ్ధిదారుడు పథకానికి అర్హత సాధిస్తే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది. ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు. ఈ నేపథ్యంలో ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సొంతింటి స్థలం లేని పేదల దరఖాస్తులను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను బట్టి ఎంత భూమి సేకరించాల్సి ఉంటుందనే దానిపై అంచనాకు వచ్చి స్థల సేకరణపై దృష్టిసారించనున్నారు.



తప్పదు మా గురి!

ఎక్కడైనా.. ఎప్పుడైనా తప్పదు మా గురి అంటున్నారు మహిళా అధికారిణులు.. మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో గురువారం క్రీడా పోటీలు ప్రారంభించారు.. కాకినాడలో ఒక మహిళా ఉద్యోగి జావెలిన్ త్రో లక్ష్యంపై పెట్టిన గురి చూస్తే షాకవాల్సిందే మరి..

- 6లో



మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ తీస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

లక్కీ..గీత!

గీత కార్మికులకు 13 షాపులు కేటాయింపు

రాజమహేంద్రవరం/అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ గురువారం పూర్తయింది. మద్యం పాలసీ 2024-26కి సంబంధించి గీత కులాలకు 10 శాతం షాపులను కేటాయిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ మేరకు జిల్లాలో 13 షాపులను కేటాయించారు. వీటికి సంబంధించి 387 మంది దరఖాస్తు చేస్తున్నారు. దీంతో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ వినీష ఆధ్వర్యంలో ప్రక్రియను పూర్తి చేశారు. షాపులను లాటరీలో చేజిక్కించుకున్న వారు వెంటనే లైసెన్సు ఫీజు చెల్లించడంతో ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేశారు. వాళ్ల షాపులను ఏర్పాటు చేసుకున్న తర్వాత తగు తనిఖీల అనంతరం రెండేళ్లకు లైసెన్స్‌లు జారీ చేస్తారు. కాగా.. గీత కులాల వారికి మద్యం షాపుల లైసెన్సు ఫీజులో 50 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తూ మరో వరం ఇచ్చింది. దీంతో గీత కులాల వారి మాటున ఇతరులు రంగంలోకి దిగారని తెలుస్తోంది.అదే జరిగితే ప్రభుత్వ ఉద్దేశం నీరుగారే పరిస్థితి వస్తుందనే ఆరోపణలున్నాయి.

పర్యాటక పెట్టుబడులకు ఏపీ అనుకూలం

జర్మనీ పర్యటనలో మంత్రి దుర్గేశ్

రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూల మని, పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ జర్మనీ పర్యటనలో పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు. బెర్లిన్ సదస్సులో మూడో రోజున ఏపీ స్టాల్ వద్ద మంత్రి దుర్గేశ్, టూరిజం ఎండీ ఆమ్రపాలి వివిధ దేశాల ప్రతినిధులకు రాష్ట్ర పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. నూతన పర్యాటక పాలసీ, రాష్ట్ర పర్యాటక ప్రాంతాల సమగ్ర సమాచార పుస్తకాన్ని అందజేశారు.అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులకు తమ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని భావిస్తోందని పేర్కొన్నారు.పెట్టుబడిదారులకు అన్ని విధాలా అనుకూలమైన వాతావరణం ఏపీలో ఉందని, పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని మంత్రి కోరారు.



తడిచెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతామణి

ఐవీఆర్ఎస్‌కు 150 పంచాయతీలు ఎంపిక

డీపీవో శాంతామణి

కడియం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం)కు జిల్లా వ్యాప్తంగా 150 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారని డీపీవో వి.శాంతామణి తెలిపారు.మండలంలోని కడియం, జేగురుపాడు, మురమండ, వేమగిరి, దుళ్ళ, వీరవరం, కడియపుసావరం గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. ఈ నెల మూడో వారం నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఆయా గ్రామాల్లో ఇంటి యజమానులకు ఫోన్ చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతోంది ? చెత్త నుంచి సంపద కేంద్రం పనితీరు ఎలా ఉంది ? అనే అంశాలను ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత గ్రామ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎం.నాగలత, ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, గ్రేడ్ 1 కార్యదర్శులు ఎం.రూప్‌చంద్,శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఆర్.సత్యనారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేపు మహిళా దినోత్సవం విభిన్నంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఈ సారి విభిన్నంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశ్రమలు,డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో విజయగాధలు, ఆర్థిక చేకూర్పు కార్యక్రమాలను పోలీ స్ శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు.స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకకు ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులు, పారిశ్రామికవేత్తల సన్మాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు 3593 కుట్టు మిషన్లు

రాజమహేంద్రవరం, మార్చి6(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు ఇవ్వడంతో పాటు, నిష్ణాతులతో శిక్షణ ఇస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల మహిళలకు కుట్టుమిషన్లు ఇస్తారన్నారు. ఎంపిక చేసిన వారికి నిష్ణాతులతో 45 రోజుల నుంచి 90 రోజుల వరకూ శిక్షణ ఇస్తామన్నారు. శనివారం నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారన్నారు.జిల్లాలో బీసీలకు 1456, కాపులకు 802, కమ్మ వర్గీయులకు 318, రెడ్లకు 303, ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ)లకు 164, ఆర్యవైశ్యులకు 177, బ్రాహ్మణులకు 232, క్షత్రియులకు 141.. మొత్తం 3593 కుట్టు మిషన్లు ఇస్తారన్నారు. 18ఏళ్ల నుంచి 50ఏళ్లలోపు మహిళలు అర్హులని, బియ్యం కార్డు ఉండాలని, కులధ్రువీకరణ పత్రం కూడా ఉండాలని ,ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఉండాలని చెప్పారు. అర్హులు మండల, మునిసిపాలిటీ, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



లక్ష్యం ఉండాలి.. గురి పెట్టాలి!

ఇదేంటో తెలుసా.. ఇంకేంటి గన్ టక్కున చెప్పింది ఒక విద్యార్థిని..అది విన్న పోలీస్ ఆశ్చర్యపోయాడు.. నీకెలా తెలుసమ్మా అన్నాడు..అదేంటి సార్.. ప్రతి సినిమా లోనూ చూస్తున్నాగా అంటూ సెలవిచ్చింది.. అది విన్న పోలీస్.. ఇది సినిమాలోలా డమ్మీ గన్ కాదమ్మా.. నిజమైన గన్.. ఒక్కసారి ట్రిగ్గర్ నొక్కామా అంతే.. అంటూ విద్యార్థినులకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయుధాలు ఎలా వాడాలి.. ప్రమాదం వస్తే ఎలా ఎదుర్కొనాలి అనే అంశాలపై ఇలా మేల్కొలిపారు.

- రాజమహేంద్రవరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహి

మహిళా చైతన్యం



ఇంధన పొదుపు, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణపై ఇంటర్ విద్యార్థిని అలుపెరగని పోరాటం

సమాజ సేవలో నైను సైతం అంటోంది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన మహి అడబాల. ఇంధన పొదుపు, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణపై అలుపెరగని పోరాటం చేస్తోందీ యువ కిశోరం.

పి.గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్మీడియట్ చదువుతున్న మహి గత ఎనిమిదేళ్లుగా అనేక అంశాలపై అవగాహన కల్పిస్తోంది. మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ ద్వారా చెట్లను పెంచడం, విద్యుత్, పెట్రోలు, డీజిల్‌లను పొదుపుగా వాడుకోవడం ద్వారా కాలుష్యం తగ్గించుకోవడంపై చైతన్యవంతం చేస్తోంది. పునరుత్పాదక శక్తులైన సోలార్, విండ్ ఎనర్జీలకు ప్రాధానమివ్వాలంటోంది. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం గురించి సహచర విద్యార్థులకు, ప్రజానీకానికి అవగాహన కల్పిస్తోంది. ఇళ్ల ఆవరణల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులను ఉపయోగించాలంటూ వివిధ వేదికలతో పాటు వీడియోల ద్వారా వివరిస్తోంది.

- ఇంధన వనరుల పొదుపుపై చిత్రలేఖనం ద్వారా అవగాహన కల్పించినందుకు 2018లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అప్పటి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ నుంచి జాతీయ అవార్డు అందుకుంది.
- విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించినందుకు 2021లో ఎన్టీపీసీ టాటా పవర్ నుంచి 'చేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు అందుకుంది.


మహిని అభినందిస్తున్న లోక్‌సభ మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్

- 2022లో మినిస్టరీ ఆఫ్ పవర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఏపీఎస్ఈసీఎం సంయుక్తంగా విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో స్పెషల్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు.
- ఆగస్టు 15, రిపబ్లిక్‌డే నాడు కలెక్టర్ నుంచి అవార్డులు అందుకుంది.
- ప్రకృతిని మనం ప్రేమిస్తే.. అది మనల్ని కాపాడుతుందని మహి సందేశమిస్తోంది.


ఎన్టీపీసీ జీజీఎం రాజేష్‌కుమార్‌సిన్హా నుంచి అవార్డు అందుకుంటున్న మహి

e-మహిళ

మహిళల స్వయం సాధికారతే లక్ష్యంగా పురుడు పోసుకున్న డ్వాక్రా సంఘాలు దినదిన ప్రవర్ధమానమయ్యాయి. వేల సంఖ్యలో గ్రూపులు, లక్షల్లో సభ్యులుగా మహిళలు స్థానిక వ్యాపారాలతో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. బ్యాంకులు అందించే రుణాలతో డ్వాక్రా సంఘాలు వారి ఆలోచనలకు తగినట్టు రకరకాల వస్తువులను తయారుచేసి ఎప్పటి నుంచో విక్రయిస్తున్నారు.





ఈ-కామర్స్ రంగంలోకి డ్వాక్రా సంఘాల ప్రవేశం

ఆన్‌లైన్‌లో 922 ఉత్పత్తుల వివరాలు

ఇప్పటికే 80 మంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా నమోదు

దిగ్గజ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మెప్మా పరిధిలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో స్వయం సహాయక సంఘాలు దాదాపు 922 రకాలు, కాకినాడ జిల్లా డీఆర్డీఏ పరిధిలోని స్వయం సహాయక సంఘాలు 897 రకాలు ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో అధిక శాతం చేతివృత్తులే. ఆధునికంగా ఎంతో నాణ్యతతో కూడిన ఆయా వస్తువుల అమ్మకాలకు సరైన వేదిక లేదు. దీంతో డ్వాక్రా మహిళలు నష్టాలు చవిచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులకు కానీ, వారు తయారుచేసిన వస్తువులకు కానీ ఆదరణ కల్పించే కనీస చర్యలు లేవు. ప్రోత్సాహం, ఆదరణ లేకపోవడం... మరోవైపు విక్రయాలు లేక నష్టాలతో డ్వాక్రా గ్రూపు మహిళలు అయోమయంలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మానస పుత్రిక అయిన డ్వాక్రా గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారించింది. వారి ఉత్పత్తుల అమ్మకాన్ని విస్తృతపరచడం ద్వారా మహిళలు మరింత ఆర్థిక స్థిరత్వం సాధించాలని లక్ష్యం పెట్టుకుంది.

ఈ క్రమంలో మెప్మా, డీఆర్డీఏ పరిధిలోని డ్వాక్రా మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాలపై కసరత్తు చేసింది. ఇందులో భాగంగా డ్వాక్రా ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకురావడం ద్వారా అమ్మకాల విస్తృతిని పెంచడంతో పాటు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలి దశలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 80 మంది డ్వాక్రా మహిళలను, డీఆర్డీఏ పరిధిలోని 524 మంది డ్వాక్రా మహిళలను ఆన్‌లైన్‌లో ఎంటర్‌ప్రెన్యూర్లుగా రిజిస్టర్ చేసే ప్రక్రియను దశలవారీగా చేపట్టారు. అందరినీ ఈ-కామర్స్ గొడుగు కిందకు తెస్తామని అధికారులు చెప్తున్నారు. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలకు అవగాహన సదస్సులు కూడా నిర్వహించారు.

డ్వాక్రా ఉత్పత్తులకు సంబంధించి ఆన్‌లైన్‌లో అమ్మకాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఆయా జిల్లాల్లోని సీఎంఎంలు, సీవోలు, డీఆర్డీఏ నుంచి వీవోఏలు ఒక్కో గ్రామ సమాఖ్య ద్వారా కనీసం నాలుగు ఉత్పత్తులను ఓఎన్‌డీసీ వెబ్‌సైట్‌లోని మైస్టోర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటికే మెప్మా, డీఆర్డీఏ నుంచి సుమారు 1,801 ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరుధాన్యాలతో తయారుచేసిన వస్తువులు, పచ్చళ్లు, ఇంటి అవసరాలకు పనికొచ్చే సామగ్రి, ఇత్తడి వస్తువులు, చేతి అలంకరణలతో పాటు మరెన్నో ఉత్పత్తులను ఓఎన్‌డీసీ పోర్టల్‌లో ఉంచారు. ఈ వేదిక ద్వారా డ్వాక్రా ఉత్పత్తులను బుక్ చేసుకునే వినియోగదారులపై అదనపు భారం పడకుండా డెలివరీ చార్జీలను ప్రభుత్వమే భరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫారాలతో పోల్చుకుంటే చౌకగా వస్తువులు దొరికే వీలున్నందున భవిష్యత్తులో పెద్ద ఎత్తున డ్వాక్రా ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరగడం ఖాయమనే ఆశాభావాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజల్లో ప్రచారం కల్పించాల్సి ఉంది. దిగ్గజ కంపెనీల ఉత్పత్తులన్నీ బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకుంటూ పెద్ద ఎత్తున ఆన్‌లైన్ వాటా చేజిక్కించుకున్నాయి. ఓ అంచనా ప్రకారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికలపై ఇంటి అవసరాలకు ఉపయోగపడే సామగ్రిపై రోజుకు జరిగే వ్యాపారం అక్షరాలా రూ.4 నుంచి రూ.5కోట్లుగా లెక్క తేల్చారు.


బ్యాగ్‌లు తయారు చేస్తున్న డ్వాక్రా మహిళలు



మెప్మా పరిధిలో జిల్లాల వారీగా ఇలా...

కాకినాడ జిల్లాలో 12,834 గ్రామైక్య సంఘాల్లో 1,41,174 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 7820 సంఘాలకు 85,398 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 3,699 సంఘాల్లో 40,484 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

డీఆర్డీఏ పరిధిలో..

కాకినాడ జిల్లాలో 1,125 సంఘాల్లో 39,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా గ్రామైక్య సంఘాల నుంచి ఆసక్తితో పాటు ప్రాథమికంగా ఆన్‌లైన్‌లపై అవగాహన కలిగిన వారిని ఎంపిక చేసి ఎంటర్‌ప్రెన్యూర్లుగా మెప్మా, డీఆర్డీఏ రిజిస్ట్రేషన్ చేసింది. ఒక్క కాకినాడ జిల్లాలోనే వీరి సంఖ్య 560గా ఉంది. ఇప్పటికే ఆన్‌లైన్ వేదికగా జరిగిన లావాదేవీల మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా చూస్తే అనుకున్న దానికంటే బాగా ఉన్నట్టు యంత్రాంగం చెప్తోంది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నాణ్యతతో ఉత్పత్తులు తయారుచేస్తున్నా మార్కెటింగ్ అవకాశాలు లేక ఇబ్బందిపడిన తమకు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్మార్ట్ నిర్ణయంతో లబ్ధి చేకూరనుందని డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు ఆత్మవిశ్వాసం అవసరం

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ● నన్నయ వర్సిటీలో ముగిసిన నారీఫెస్ట్


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, (ఇన్‌సెట్లో) మహిళా ఉద్యోగులతో కలెక్టర్, వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆత్మవిశ్వాసం అవసరమని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివాన్‌చెరువులోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న నారీఫెస్ట్ గురువారంతో ముగిసింది. సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం చేసిన కృషిని వివరించారు. సమానత్వపు హక్కును అలవాటు చేసుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం నేర్చుకోవాలని సూచించారు. వర్శిటీకి మహిళా వీసీగా ప్రసన్నశ్రీ ఉండడం ఆనందదాయకమన్నారు. మరో అతిథి, వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ లింగ సమానత్వం వైపు వేగంగా, మరింత ప్రభావ వంతంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పద్మ విశ్వనాథుల, సెంట్రల్ జైలు డీఎస్పీ వసంతకుమారి, నన్నయ వర్శిటీ ఉమెన్‌సెల్ కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరిదేవి, తహశీల్దార్ జీఎఎస్ లక్ష్మీదేవి, జిల్లా ప్రభుత్వాసుపత్రి పిల్లల వైద్యురాలు ఇంద్రజ పాల్గొన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అన్నపూర్ణకు ఉత్తమ మహిళా రైతు పురస్కారం


ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారదాలక్ష్మి నుంచి అవార్డు అందుకుంటున్న అన్నపూర్ణ

కోరుకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరులో) గురువారం జరిగిన కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నిడిగట్లకి చెందిన మహిళా రైతు వేమగిరి అన్నపూర్ణకు ఉత్తమ మహిళా రైతుపురస్కారం లభించింది. జిల్లా ఏరువాకకేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహరావు, ఆర్.శారదాలక్ష్మి దేవి చేతులమీదుగా విశ్వవిద్యాలయ అధికారుల సమక్షంలో అన్నపూర్ణను సత్కరించి, ప్రశంసాపత్రం, నగదు అందజేశారు. అన్నపూర్ణ నిడిగట్లలో ప్రకృతి వ్యవసాయం, వర్మీ కంపోస్టు తయారీ, సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాలను ముమ్మరంగా చేస్తోంది. ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు అందించే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నాణ్యమైన, స్థిరమైన పంట దిగుబడులు పొందుతూ జిల్లాలోని రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆమె కృషిని గుర్తించి రాష్ట్రస్థాయి మహిళా రైతు అవార్డుకు ఏరువాక కేంద్రం తరుపున ప్రతిపాదనచేశారు. తదనుగుణంగా విశ్వ విద్యాలయ అధికారులు అన్నపూర్ణను ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా రైతుగా ఎంపికైన అన్నపూర్ణను శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అభినందించారు.


కాకినాడ : త్రోబాల్ ఆడుతున్న మహిళా ఉద్యోగిని


కాకినాడ : జావెలిన్‌త్రోలో ...

ఉల్లాసంగా... ఉత్సాహంగా



● రెండోరోజూ కొనసాగిన మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు

● కాకినాడ జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో, రాజమహేంద్రవరంలో నిర్వహణ


కాకినాడ: పోటీలకు హాజరైన మహిళా ఉద్యోగులు




రాజమండ్రి : రాజమండ్రిలో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో రెండోరోజు గురువారమూ మహిళా ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. ఉల్లాసంగా... ఉత్సాహంగా పోటీలు జరిగాయి. త్రోబాల్, జావెలిన్‌త్రో, పాటలపోటీలు, షటిల్ బ్యాడ్మింటన్, లెమెన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్కంఠరేకెత్తించాయి. కార్యక్రమంలో ఏపీఎ న్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ, డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, టెన్నీకాయిట్, స్పీడ్ బాల్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, త్రెడ్ అండ్ నీడిల్ , తదితర క్రీడలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగినులు పాల్గొన్నారు. ఏపీజీఈఏ మహిళా విభాగం నాయకులు సీహెచ్‌వీ లక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యోగినిల సమస్యల పరిష్కారానికి సంఘం తమవంతు సహకారం అందిస్తోందన్నారు. మహిళా విభాగం నాయకులు అంజలిశ్రీ, సుజాత, లక్ష్మి, హైమావతి ఆయా విభాగాల మహిళా టీమ్స్‌కు నాయకత్వం వహించారు. కాగా ఎనిమిదో తేదీన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాలులో సాయంత్రం నాలుగు గంటలకు మహిళా దినోత్సవ సభను నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట కట్లపాము కలకలం


ఇంజన్ పార్ట్‌లో దూరిన పాము

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ భవన్ దుకాణాల వద్ద గురువారం కట్లపాము కలకలం సృష్టించింది. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనంలోకి దూరడంతో వాహనదారుడు బెంచేలెత్తిపోయాడు. దీంతో ఒక్కొక్క పార్ట్‌ను తీసి చాకచక్యంగా బయటకు తీశారు. అనంతరం జనావాసాలకు దూరంగా విడిచిపెట్టడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.


బైకు పార్ట్ మధ్యలో ఇరుక్కుంటూ..


ఇలా చాకచక్యంగా బయటకు..

విషాద జర్నీ..!

జీవ నోపాధికి తమ స్వగ్రామాలను విడిచి మహానగ రానికి వెళ్లారు. వారంతా తమ స్థాయికి తగిన వృత్తులను చేసుకుంటూ జీవిస్తున్నారు. తమ గ్రా మంలో జాతర జరుగుతుందని కుటుంబ సభ్యు లతో ఆనందంగా గడుపుదామని, బంధువులంద రికి వస్త్రాలు పెడదామని ఆనందించిన ఓ వ్యక్తి తన కుటుంబానికి ఆ కబురు చెప్పి బయలు దే రాడు. మరో మహిళ తమ బంధువుల వివాహా నికి బయలుదేరింది. బంధువులతో చాలా కాలం తర్వాత తమ బంధువులను అందరినీ నీనసీచూడబో తున్నానని ఎంతో సంతోషంతో తమ ప్రయాణా న్ని కొనసాగించారు. తమ గ్రామంలో జరిగే విగ్ర హ ప్రతిష్ఠకార్యక్రమంలో పాల్గొనడానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులను నిర్వర్తిస్తున్న యువతి బ యల్దేరి వస్తోంది. వీరందరి కుటుంబాల్లోని సంతోషాన్ని లారీ రూపంలో మృత్యుదేవత మింగేసింది.



సంఘటనా స్థలంలో రోడ్డుపై పడ్డ గాజుముక్కలతో భయంకరంగా ఉన్న దృశ్యం

- టైరు పంచరై రోడ్డుపై ఆగిపోయిన లారీ
- లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు
- బస్సు డ్రైవర్‌తో సహా ముగ్గురు ప్రయాణికుల మృతి
- 21 మందికి తీవ్ర గాయాలు
- హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు వస్తుండగా ప్రమాదం

ఏలూరు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : హైద రాబాద్ నుంచి కాకినాడకు రమణ ట్రావెల్స్ బస్సు బుధవారం రాత్రి 34 మంది ప్రయాణికు లతో బయలుదేరింది. ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ టైర్లు పేలిపోవడంతో రోడ్డుపై నిలిపివేశారు. హైవే పెట్రోలింగ్ వాహనాలు ఆలారీ సమీపంలో హె చ్చరిక రేడియం స్టిక్కర్‌బోర్డులు ఏర్పాటు చేయా ల్సి ఉన్నా అసలు పెట్రోలింగ్ వారు కాన రాలే దు. దీంతో ఆ లారీని అక్కడే ఉంచి డ్రైవర్, క్లీనర్ అక్కడ ఉంచి పక్కనే ఉన్న డివైడర్ వద్దకు వెళ్లి నిద్రించారు.రమణ ట్రావెల్ బస్సుకు ముందు వెళ్తున్న మరో బస్సు డ్రైవర్ లారీని గమనించి ఒకసారిగా కుడివైపునకు వెళ్లి ఆ లారీని తప్పిం చి ముందుకెళ్లిపోయాడు. అయితే ఆబస్సు వెనుకే వస్తున్న రమణ ట్రావెల్ బస్సు డ్రైవర్ లారీని తప్పించలేక వేగంగా ఢీ కొనడంతో బస్సు బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో ప్రైవేటు బస్సు డ్రైవర్ తో పాటు ముగ్గురు ప్రయాణికులు మృతి చెంద గా మరో 21మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షత గాత్రులను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి అం బులె న్సులో హైవే పెట్రోలింగ్ టీమ్ తరలించారు.

జాతరకు వస్తూ..

భీమడోలులోని గుర్రాల చెరువునకు చెందిన బొంతు భీమేశ్వరరావు (43)కు భార్య వెంకటల క్ష్మి, కుమారుడు పార్థసారథి విజయవాడ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. కుమార్తె జేష్ణవి 9వ తరగతి చదువుతోంది. భీమేశ్వరరావు హైదరాబాద్‌లో పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తమ గ్రా మంలో ఈనెల 9వతేదీ నుంచి జాతర ఉండడ ంతో గ్రామానికి రావాలని బంధువులకు ఫోన్లు చేసి ఆహ్వానించారు. అందరికీ నూతన వస్త్రాలు పెట్టాలని ఆ కుటుంబ సభ్యులు భావించారు. హైదరా బాద్‌లో బయలుదేరిన భీమేశ్వరరావు గత రెండు నెలల నుంచి కష్టపడిన సొమ్మును తన బ్యాగ్‌లో పెట్టుకుని బయలుదేరుతూ తన కుమార్తెతో మూడుసార్లు ఫోన్‌లో మాట్లాడాడు. కుమార్తెకు ఇష్టమైన కేక్‌ను హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నానని చెప్పాడు. తండ్రి రాక కోసం గురువారం ఉదయం నుంచే ఎదురు చూస్తు న్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. చివరకు పోలీసులు ఫోన్‌చేసి ఆస్పత్రికి రావాలని చెప్పడంతో అక్కడకు చేరుకున్న వారు భీమేశ్వర రావు మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. ఆ కుటుంబానికి ఇంటి పెద్ద కోల్పోవడంతో కుటుం బం మొత్తం దిక్కుతోచని పరిస్థితిలో ఉండి పోయింది.

బంధువుల ఇంట్లో పెళ్లికి వస్తూ..

కాకినాడజిల్లా కాజులూరు మండలం కాలావా రిపేట పల్లిపాలానికి చెందిన జుత్తిగ భవాని (38)కి భర్త చిన అప్పారావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చదువు తుండగా, చిన్న కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతు న్నాడు. కొంతకాలం నుంచి హైదరా బాద్‌లోనే ఉంటున్నారు. బంధువుల ఇంట్లో వివాహం జరుగుతుందని ఆ వివాహానికి భవాని హాజరయ్యే నిమిత్తం బయలుదేరి వస్తూ మార్గమధ్యలో మృత్యువాత పడింది.

విగ్రహ ప్రతిష్ఠకు వస్తూ....

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రరా విపల్లికి చెందిన మటపర్తి భవాని (23) హైదరా బాద్‌లోని టీసీఎల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేస్తోంది. ఆమె తండ్రి రైతు. తల్లి గృహి ణి. సోదరుడు డిగ్రీ చదువుతున్నాడు. తమ గ్రా మంలో విగ్ర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యే నిమిత్తం హైదరాబాద్ నుంచి బయలుదేరి బస్సులో వస్తూ మార్గమధ్యలోనే మృత్యువాత పడింది. ఆమె తండ్రి రాజు ఆస్పత్రికి చేరుకుని కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయాడు.

● రమణ ట్రావెల్ బస్సు డ్రైవర్ కాకినాడకు చెందిన ముంగంటి మధుసూదన్ (38) కూడా మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతను ఏలూరు ప్రభుత్వా స్పత్రిలో కొట్టుమిట్టాడుతూ కొద్ది సేపటిలోనే మృత్యువాత పడ్డాడు. అయితే అతని పూర్తి వివరాలు తెలి యాల్సి ఉంది. అయితే రమణ ట్రావెల్స్‌కు చెందిన వారు ఒక్కరు కూడా రాకపోవడం గమనార్హం. వారుకు సంబంధించిన సెల్‌ఫోన్లు అన్ని స్విచ్ ఆఫ్ చేశారు.

● క్షతగాత్రులు వీరే..

ప్రమాదంలో 21 మంది తీవ్ర గాయాల య్యారు. వీరిలో ముగ్గురు పిల్లలు, తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. కోలా సురేఖ, కోలా రాజబాబు, కోలా లిఖిత, పనమనీడి ఆదిలక్ష్మి, మద్దాల కీర్తి, మాచర్ల సుజాత, మండపాక బాలాజీ, మండపాక శ్రీదేవి, మండపాక హరిణి, మండపాక శశిరేఖ, ఆర్నాలకంటి శ్రీలక్ష్మి, కోట వేణి, జి.మణికంఠ (క్లీనర్)పువ్వుల శ్యామ్‌కుమా ర్, శీలంప్రకాష్, ఎం.ప్రతాప్, పి.అక్కమ్మ, పి.హే మలత, గొణజ విజయ్‌కుమార్, రామిశెట్టి సోమసత్యనారాయణ, టి.రవికుమార్ గాయాల పాలయ్యారు.

హైవే పెట్రోలింగ్ వైఫల్యం ప్రమాదానికి కారణం

16వ నెంబర్ జాతీయ రహదారి మెయింటెనె న్సును నిర్వహించే సంస్థ జాతీయ రహదారి వెంబడి నిరంతరం గస్తీ కొనసాగిస్తూ ఉండాలి. ఎక్కడైనా ఏదైనా వాహనం ఆగిపో యిన వెంట నే అక్కడ తగిన రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. అవసర మైతే ఆ వాహనాన్ని క్రేన్లతో పక్కకు తీయించాలి. టోల్‌గేట్ల వద్ద సొమ్ములు వసూలు చేస్తున్న సంస్థయే ఈ బాధ్యతలను చేపట్టాలి. తూతూ మంత్రంగా రహదారిపై పెట్రోలింగ్ పె ట్టారు. వాస్తవానికి పది కిలోమీటర్లు ఒక పెట్రోలింగ్ వాహనం ఉండాల్సి ఉండగా ఏకంగా 30 కిలోమీ టర్లకు ఒక వాహనాన్ని నామమాత్రంగానే పెట్టా రు. వీరు కూడా టోల్‌గేటు వద్దో ఇతర ప్రాంతంలో వాహనం పెట్టుకుని ఉంటున్నారే తప్ప పెట్రోలింగ్ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా చొదిమెళ్ల వద్ద నిలిచిన లారీని హైవే పెట్రోలింగ్ సిబ్బంది సకాలంలో తొలగించినా, అక్కడ తగిన జాగ్రత్తలు తీసుకు న్నా ఈ ప్రమాదం జరిగేది కాదని నిపుణులు చెప్తున్నారు.

బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చి మృత్యువాత



జిత్తుగ భవాని(ఫైల్)

తాళ్లరేవు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మం డలం పల్లిపాలెం శివా రు కాలావారిపేటకు చెందిన జిత్తుగ భవాని (38), చిన అప్పారావు భార్యాభర్తలు. వీరి కు మారుడు హర్షకుమార్ వైజాగ్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మరో కుమా రుడు భాను హైదరాబాద్‌లో ఇంటర్ పరీక్షలు రాస్తున్నాడు. 14 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం భార్య, పిల్లలతో అప్పారావు హైదరాబాద్ వచ్చా డు. పనిచేసుకుని జీవిస్తున్నారు. రామచంద్రపు రంలో బంధువుల ఇంట్లో పెళ్లికి భవాని బుధ వారం రాత్రి 9.30 గంటలకు హైదరాబాద్ ఎర్రగడ్డలో బస్సు ఎక్కింది. ఏలూరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు కాలావారిపేటలో భవాని మృతదేహం కోసం ఎదురుచూస్తున్నారు.

ఆలయ ప్రతిష్ఠకు వస్తూ తిరిగిరాని లోకాలకు..



మట్టపర్తి భవాని(ఫైల్)

జగ్గంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జగ్గంపే ట మండలం కాట్రావు లపల్లి గ్రామానికి చెంది న మట్టపర్తి భవాని (23)గురువారం తెల్లవా రుజామున హైదరాబా ద్ నుంచి కాకినాడ వ స్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఏలూరు రూర ల్‌లో ఇసుక లారీ ఢీ కొట్టడంతో బస్సు తిరగబ డింది. దీనిలో భాగంగా భవాని ఆ బస్సులో ఉం డటంతో ఆమె మృతి చెందినట్టుగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో తల్లిదండ్రు లకు తెలియజేయడంతో వారు ఏలూరు ప్రభు త్వాసుపత్రికి వెళ్లారు. గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ చేయడంలో భాగంగా కలియుగ దైవం వెంకటే శ్వరస్వామికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న భవా ని పట్టువస్త్రాలు ఇస్తానని మొక్కుకోవడంతో మొక్కు తీర్చుకోవడానికివస్తూ దారిమార్గంలో నే ఆ స్వామివారి సన్నిధికి చేరిందని కాట్రావుల ప ల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.











మృత దేహాలను సంఘటనా స్థలం నుంచి తరలిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్, క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, మృతి చెందిన డ్రైవర్, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

15న జిల్లా పరిషత్ సర్వసభ్య, బడ్జెట్ సమావేశం

కాకినాడ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమా వేశం నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచా యతీరాజ్ చట్టంలోని నిబంధలకు లోబడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశం ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించ నున్నామని తెలియ జేశారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు హాజరుకావాలని సీఈవో కోరారు.

చినజగ్గంపేట పౌల్ట్రీఫారంలో తనిఖీలు

● 27.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గం పేటలోని మైత్రి పౌల్ట్రీఫారంలో గురువారం సివిల్‌సప్లైస్ అధికారులు తనిఖీలు నిర్వహిం చారు. 27.50 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వా ధీనం చేసుకున్నారు. పౌల్ట్రీ ఫారంలో బుధ వారంరాత్రి తనిఖీలు నిర్వహించిన గొల్ల ప్రోలు తహసీల్దారు సత్యనారాయణ అక్కడ బియ్యం నిల్వలు గుర్తించి వాటిని గదిలో వేసి సీల్ చేశారు. గురువారం వచ్చిన సివిల్‌స ప్లైస్ డిప్యూటీ తహసీల్దారు వి.భారతి ఇతర అధికారులు వాటిని పరిశీలించి రేషన్ బి య్యంగా నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు. 6(ఏ) కింద కేసులు నమోదు చేశారు. అదే విధంగా పౌల్ట్రీఫారమ్ నిర్వాహకుడు అల్లుమ ల్లు కృష్ణపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని డీటీ భారతి గొల్లప్రోలు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. స్వాధీనం చేసుకున్న 27.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైస్ స్టాకు పాయింటుకు తరలించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.1.66 లక్షల విరాళం



ఈవో సుబ్బారావుకు విరాళం ఇస్తున్న దాత

అన్నవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అన్న వరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ 1,66,323 విరాళం ఇచ్చారు. పశ్చిమగోదా వరి జిల్లా నరసాపురం మండ లం రుస్తుం బాడకు చెందిన బి.కృష్ణప్రసాద్ ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు ఇచ్చారు. దాతను ఆయ న అభినందించి వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు తదితరులు ఉన్నారు.

10న ఐటీఐ అభ్యర్థులకు అప్రంటీస్ మేళా

అమలాపురంటౌన్/కాకినాడ కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీ మ జిల్లాలోని వివిధ కంపెనీల్లో ఉన్న అ ప్రంటీస్ ఖాళీలను భర్తీచేసేందుకు కాకినా డ ప్రభుత్వ ఐటీఐలో అప్రంటీస్ మే ళా-2025 నిర్వహిస్తున్నట్లు కాకినాడ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులు అప్రంటీస్ మేళాకు హాజరుకా వాలి. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్ మెంట్, సిబ్బంది వచ్చి అప్రంటీస్ ట్రైనీల ను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారన్నా రు. ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో ట్రైనింగ్ పూర్తిచేసుకుని ఎన్సీసీ స ర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టి ఫికెట్లతో అప్రంటీస్ మేళాకు హాజరుకావా లని తెలిపారు. వివరాలకు సెల్ 8639230775ను సంప్రదించాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కె.గంగవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి నిం డు జీవితాన్ని బలితీసు కున్న సంఘటన మండల ంలో జరిగింది. పామర్రు ఎస్.ఐ. ఎస్.కె. జానీ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుం దరపల్లి గ్రామానికి చెందిన అడపా శ్రీనివాస్(42) ఇటీవల కొన్నిరోజుల నుంచి మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి కూళ్ల ఏటిగట్టు వద్ద పొలాల్లోని పాకలో ఉరి వేసుకుని ఆత్మహ త్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నా రు. భార్య రమాదేవి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, శ్రీని వాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహిం చి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్.ఐ. చెప్పారు.

అగ్నిప్రమాదంలో పొగాకు బేరన్ల దగ్ధం

- వేర్వేరుచోట్ల ఘటనలు
- లబోదిబోమంటున్నరైతు

గండేపల్లి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రామయ్యమ్మ పాలెం గ్రామంలో గురువారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన మైలవరపు వెంకటరావు(పె ద్దకాపు) అనే రైతు పొగాకు బేరన్ అగ్ని ప్రమా దానికి గురై పూర్తిగా కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొగాకు వేడిచేసే సమయంలో ఇనుప జిడ్డుగొట్టం బాగా వేడెక్కి ఎర్రగామారిపోవడంతో పొగాకు ఆకులు రాలి గొట్టంపైపడి ప్రమాదవశాత్తు ఆకులు అంటు కుని మంటలు చెలరేగి లోపల ఉన్న పొగాకు, బేరన్‌లో ఉన్న సామాగ్రి అంతా పూర్తిగా కాలి పోయిందన్నారు. నష్టం సుమారు రూ.5లక్షలు ఉంటుందన్నారు. ప్రమాదం జరిగిన సమయం లో మంటలు అదుపు చేసేందుకు జగ్గంపేట ఫైర్‌స్టేషన్‌కి సమాచారం ఇచ్చారు. వారు వచ్చే లోపు మొత్తం కాలిపోయింది. రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తూ జీవనం సాగిస్తు న్నాడని ఇప్పుడు పంట అగ్నిప్రమాదానికి గురై కాలిపోవడంతో ఏం చేయాలో అర్థంకాక లబోది బోమంటున్నాడు. అధికారులు ఆదుకోవాలని బో రున విలపిస్తున్నాడు. కాగా మంటలు చుట్టుప క్కల వ్యాప్తి చెందకుండా అగ్నిమాపక సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు.



రామయ్యమ్మపాలెంలో అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న పొగాకు బేరన్

వాదాలకుంటలో పొగాకు బేరన్ దగ్ధం

గోపాలపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని వాదాలకుంట గ్రామానికి చెందిన గెడా కుమారి పొగాకు బేరన్ గురువారం కాలి బూడిదైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గెడా కుమారికి చెందిన బేర్న్‌లో గురు వారం 11గంటల సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి బేర్న్‌లో పొగాకు మొత్తం కాలిబూడిదైనట్లు తెలి పారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశామన్నారు. అయినప్పటికీ మంటలు అదుపులో లేకపోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక అధికారి అబ్రహం తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. అప్పటికే బేర్న్ పూర్తిగా కాలిపోయిందన్నారు. అగ్నిప్రమాదంలో సుమారు రూ.5లక్షలు పొగాకుకు ఆస్తినష్టం వాటిల్లినట్లు జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి అబ్రహం తెలిపారని అన్నారు.



వాదాలకుంటలో కాలుతున్న పొగాకు బేరన్ నుంచి బయటకు వస్తున్న పొగ

జనసేన ఆవిర్భావ సభకు చురుగ్గా ఏర్పాట్లు

- బారీకేడింగ్, చదును చేసే పనులు
- పరిశీలించిన కాకినాడ ఎంపీ ఉదయ్

పిఠాపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాకినా డజిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న ని ర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ఏర్పా ట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బహిరంగ సభ ప్రాంగణం, సభకు వచ్చే మార్గాలు, స్వాగత ద్వా రాలు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా సభాప్రాంగణానికి వచ్చేందుకు హెలిప్యాడ్ ఏర్పాటు పనులను నిర్వహిస్తున్నారు. కార్యక్ర మాల నిర్వహణ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి, సభా ప్రాంగణాన్ని శుభ్రంచేసి చదును చేస్తున్నారు. గురువారం భారీ కేడింగ్ పనులను ప్రారంభించారు. పనులు జరుగుతున్న తీరుని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పరిశీలించారు.



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు

సభకు ఉభయ తెలుగురా ష్ట్రాలతోపాటు దేశ, విదేశాల నుంచి వచ్చే నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఇబ్బ ంది లేకుండా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు ఉండాలని సూచించా రు. ఆయన వెంట జనసేన నాయకులు కడారి తమ్మయ్య నాయుడు, సూరవరపు సురేష్, రావు అక్షయ్, దానం లాజర్ బాబు తదితరులు ఉన్నారు. సభా ప్రాంగణంలో ఏర్పాట్లను జనసేన కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాసరావు పరి శీలించారు.

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలి

● వివిధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో ఆర్డీవో శ్రీకర్



వాడపల్లి వెంకన్న ఆలయంలో కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, మార్చి6(ఆంధ్రజ్యోతి): వాడ పల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవా లను విజయవంతంగా నిర్వహించాలని కొత్త పేట ఆర్డీవో పి.శ్రీకర్ పేర్కొన్నారు. గురువారం ఆలయంలోని వివిధ శాఖల అధికారులతో తొలి విడత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రి ల్ 7 నుంచి 13వరకు జరిగే కల్యాణోత్సవాలకు లక్షలాది మంది యాత్రికులు తరలిరానున్నారు. నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఏప్రిల్ 8న తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవం సందర్భం గా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా ఆయన సమీక్షించారు. స్వామివారి ఉత్సవాలలో సుమారు 80 మంది పారిశుధ్య కార్మికులను నియమించి చర్యలు చేపడుతున్న ట్లు డీఎల్పీవో పి.రాజు పేర్కొన్నారు. ఈ ఉత్సవా లకు 120మంది పోలీస్ సిబ్బందిని నియమిస్తు న్నట్లు ఎస్.రాము తెలిపారు. వివిధ డిపోల నుంచి సుమారు 60 బస్సు సర్వీసులు వాడపల్లి నడుపుతామని రావులపాలెం ఆర్టీసీ డీఎం రమణ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, అగ్నిమాపక, మత్స్యశాఖ, వైద్యశాఖ తదితర విభాగాలకు చెందిన అధికా రులు స్వామివారి ఉత్సవాలకు చేపట్టే ఏర్పా ట్లపై వివరించారు. రెండవ దఫా నిర్వహించే సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించి ఉత్సవా లను విజయవంతం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు స్వామి వారి ఉత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లను సమావేశంలో వివరించారు. అనంతరం స్వామి వారి కల్యాణం జరిగే ప్రదేశం వాహనాల పా ర్కింగ్ ప్రదేశాలు పుష్కరఘాట్లను పరిశీలించా రు. కార్యక్రమంలో తహశీల్ధారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ముదునూరి వెంక ట్రాజు, ఉప సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి అవార్డు



సర్టిఫికెట్ అందిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో రోగు లకు మెరుగైన వైద్యసేవలు అందించినందుకుగానూ కేంద్ర ప్రభుత్వం రంపచోడవరం ఏరి యా ఆసుపత్రికి అవార్డు ప్రక టించిందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. నేష నల్ హెల్త్‌సిస్టం ద్వారా ము స్కాన్ టీం సభ్యులు డాక్టర్ గోపాల్, డాక్టర్ రియాజ్ గత జనవరిలో ఆసు పత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై పరిశీలించా రన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రికి గుర్తింపు సర్టిఫి కెట్ మంజూరు చేసినట్టు తెలిపారు. కార్యక్ర మంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, ఆర్ఎం వెంకటఇందిర, వైద్యాధికారులు ఆది లక్ష్మి, క్రాంతి, సుగుణ, ప్రేమ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమలో నందమూరి కుటుంబం సందడి


● ఓ వివాహ వేడుకకు హాజరైన కల్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్ భార్య, తల్లి



గాయిత్రి, అఖిల్ దంపతులను ఆశీర్వదిస్తున్న సినీ హీరో కళ్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని, భార్య ప్రణతి, అసెంబ్లీ స్పీకర్ అయన్నపాత్రుడు

పి.గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోనసీ మ జిల్లాలో సినీ హీరో కల్యాణ్‌రామ్, జూనియర్ ఎన్టీఆర్ తల్లి, భార్య సందడి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక శివారు చాకలిపాలెం కన్వెన్షన్ హాల్‌లో ప్రముఖ పంచాగకర్త, సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వ రావు కుమార్తె గాయత్రి వివాహం జరిగింది. దీనికి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. సినీహీరో నందమూరి కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని, భార్య లక్ష్మీప్రణతిలతో పలువురు కుటుంబసభ్యులు వివా హ వేడుకకు హాజరై గాయత్రి, అఖిల్‌ను ఆశీర్వ దించారు. నందమూరి కుటుంబీకులతో పలువురు సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. కాసేపటికే వారంతా కళ్యాణమండపం నుంచి వెనుదిరిగారు. కాగా కారుపర్తి కోటేశ్వరరావు సిద్ధాంతి జూనియర్ ఎన్టీఆర్ వివాహం జరిపించారు. అప్పటి నుంచి ఆయనకు వారి కుంటుంబంతో సన్నిహిత సంబం ధాలు ఏర్పడ్డాయి. పలుమార్లు కోనసీమ జిల్లాలోని మొగలికుదురులో ఉన్న శివాలయంలో కూడా జూనియర్ ఎన్టీఆర్ కుటుంబసభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారని, అదే సాన్నిహిత్యంతో కోటేశ్వరరావు కుమార్తె గాయత్రి వివాహ వేడుకకు హాజరయ్యారని తెలిసింది. అసెంబ్లీ స్పీకర్ అయన్న పాత్రుడు ఈ వివాహానికి హాజరై నూతన వధూవరులు గాయత్రి, అఖిల్‌ను ఆశీర్వదించారు.

పోలవరం పనులను పరిశీలించిన కాకినాడ కలెక్టర్



లోవ కొత్తూరు వద్ద పోలవరం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

తునిరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యో తి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సన్ మోహన్ షగిల్ పరిశీలించారు. తుని మండలంలో హంసవరం చేపూరు లోవ కొత్తూరు ప్రాంతాల్లో ఈ పోలవరం పనులను కలెక్టర్ పరిశీలించారు. కుమ్మరిలోవ తాళూ రుల్లో ఇటీవల రైతులు చేస్తున్న ఆందోళనపై కలెక్టర్ తహసీల్దార్ ప్రసాద్‌ను ఆరా తీశారు. భూములు కోల్పోయిన రైతులకు భూములు ఇచ్చేం దుకు ప్రభుత్వం హామీ ఇచ్చిన నేప థ్యంలో ప్రభుత్వ భూములు లభ్యతను పరిశీ లించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

జిల్లాలో 1500 నీటి కుంటలు ఏర్పాటు



డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు

గోకవరం, మార్చి6(ఆంధ్రజ్యోతి): పొలాల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు జిల్లాలో 1500 నీటి కుంటల(ఫారం పాండ్స్) ఏర్పాటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు డ్వామా పీడీ ఎ.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న నీటి కుంటల నిర్మాణ పనులను గురువారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జూన్ నెలాఖరుకు నీటి కుంటల లక్ష్యం పూర్తి చేస్తామన్నారు. గోకవరం మండలంలో సుమారు 260 నీటి కుంటల నిర్మాణం దశగా కృషి చేస్తామన్నారు. పీడీ వెంట ఉపాధి ఏపీవో అప్పలరాజు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రైల్వేస్టేషన్ సలహా కమిటీ

రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రైల్వేస్టేషన్ సలహాకమిటీ సూచించింది. స్టేషన్‌లోని అధికారులతో కమిటీ గురువారం సమావేశమైంది. ప్లాట్‌ఫాంలు, ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించింది. స్టేషన్‌లోని కుక్కల బెడదను పట్టించుకోకపోవడంపై కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ప్రీ పెయిడ్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పార్కింగ్‌లో వాహనాలు ఎండకు ఎండి వానకు తడుస్తున్నాయని పేర్కొన్నారు. వాహనాల రక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.కమిటీ వినతులను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పీవీ సుబ్రహ్మణ్యం, యానాపు ఏసు, ఎం.కృష్ణమాచార్యులు, తంగెళ్ల శ్రీనివాస్, ఎస్‌ఎంఆర్ రంగనాథ్,సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కళ్యాణ్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్ఐ లక్ష్మీ పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదులకు క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, ప్రతిఒక్కరిలో స్నేహ స్ఫూర్తిని నింపుతాయని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కాశి శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం మహిళా న్యాయవాదులకు క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప పోటీలు ప్రారంభించారు. వీరేంద్రనాథ్ మాట్లాడుతూ న్యాయవాదుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తునామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ధర్నాల కోటేశ్వరరావు, పద్మిని, పిట్టా చంద్రశేఖర్, దుండి ప్రభాకర్, రామలింగారెడ్డి, అరుణ, మాగాపు పద్మ, శకుంతల, ప్రియాంక పాల్గొన్నారు.

మహదేవ్‌లాల్ ష్రాఫ్ జయంతి

దివాన్‌చెరువు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఫార్మసీ విద్య పితామహుడు మహదేవ్ లాల్ ష్రాఫ్ ఫార్మసీ రంగంలో అత్యంత కీలక పాత్ర పోషించారని దివాన్‌చెరువులోని వీజే కళాశాల ప్రిన్సిపాల్ డి.నరేంద్ర అన్నారు. మహదేవ్‌లాల్ ష్రాఫ్ జయంతి సందర్భంగా కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య ష్రాఫ్ జన్మదినమైన మార్చి 6ను జాతీయ ఫార్మసీ విద్య దినోత్సవంగా నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీ జగన్మోహనరెడ్డి, ఏపీటీఐఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ, క్లినాక్సీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ బి.సతీష్‌కుమార్, ఆర్‌వీ ల్యాబ్స్ డైరెక్టర్ అండ్ క్వాలిటీ మేనేజర్ సీహెచ్.విజయకుమార్ పాల్గొని ప్రసంగించారు. పలు అంశాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

తల్లాప్రగడ విశ్వసుందరమ్మ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన స్ఫూర్తికి గుర్తుగా స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో రాజమండ్రిలో ఆనంద నికేతన్ ఆశ్రమాన్ని నెలకొల్పి, ఎంతో మంది దేశభక్తులకు ప్రేరణనిచ్చిన తల్లాప్రగడ దంపతులు ధన్యులని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్ పర్సన్ ముదునూరు వాణిశ్రీ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు తల్లాప్రగడ విశ్వసుందరమ్మ జయంతి సందర్భంగా గురువారం స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో విశ్వసుందరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆరు నెలల కఠిన కారాగార శిక్షను అనుభవించారని, స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, రఘుపాత్రుని సాయిబాబా పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్యాలు సాధ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్

రాజానగరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాకారం చేసే దిశగా నిరంతర సాధన చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులకు గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అటవీ సంపదను కాపాడుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు.పర్యావరణ వ్యవస్థ ద్వారా మనకు లభిస్తున్న అమూల్యమైన సేవలను వివరించారు. తొలుత వర్సిటీని సందర్శించిన విజయ్‌కుమార్.. ప్రో వైస్‌చాన్సలర్ కె.విజయభాస్కరరాజు, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మలతో సమావేశమైన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శాంతి స్వరూప్, జీజీయూ బీఎస్సీ అగ్రికల్చరల్ హెచ్‌వోడీ బలరాం భగత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు మాల ఉద్యోగుల ఆత్మీయ సదస్సు

జిల్లా చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాల ఉద్యోగులంతా ఏక తాటికి పైకి వచ్చి ఈనెల 8న రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో జరిగే మాల ఉద్యోగుల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఏపి మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో గురువారం జరిగిన విలేకరల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌గా సదస్సు జరుగుతుందన్నారు. ఉప వర్గీకరణ, భవిష్యత్ ప్రణాళిక, సభ్యత్వ సేకరణ జిల్లా కార్యవర్గ ఎన్నికల సమస్యలపై అర్జీలు స్వీకరణ అజెండా అంశాలుగా సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న, రిటైర్ అయిన మాల ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, మాల వ్యాపారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కోశాధికారి జంగం సుబ్బారావు మాట్లాడుతూ ఈ దస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ముఖ్యులు హాజరౌతారని తెలిపారు.

రేపు అనపర్తిలో మహిళా దినోత్సవం

రంగంపేట,మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న మండలం కేంద్రమైన అనపర్తిలోని తిలక్ రెడ్డి కల్యాణ మండపంలో రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళా ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 800 మందితో అంతర్జాతీయ మహిళా దినోవత్సవం నిర్వహిస్తున్నామని సీడీపీవో జె.జెస్సీఫ్లోరెన్స్ తెలిపారు. గురువారం అనపర్తి తిలక్‌రెడ్డి కళ్యాణ మండలంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారిత సమానత్వ హక్కులను గుర్తుచేశారు. అనంతరం మహిళలకు పోటీలు నిర్వహించారు. సమావేశంలో రంగంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

వీరవరంలో హైందవ సంఘాలు కొవ్వొత్తుల ర్యాలీ.. ఆబోతుకు పోస్టుమార్టం

కడియం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మూగజీవాన్ని హింసాత్మకంగా హత్య చేసిన సంఘటనను ఖండిస్తూ వీరవరంలో గ్రామస్థులు, హైందవ సంఘాలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మూగ జీవాన్ని హత్యచేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు ఇకపై జరగకుండా చూడాలని కోరారు. హిందువుల మనోభావాలకు భంగం కలగకుండా, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరుగకుండా చూడాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పొట్టిలంక సమీపంలో ఆబోతును పూడ్చిపెట్టిన ప్రాంతానికి రెవెన్యూ, పోలీసులు చేరుకున్నారు. పొట్టిలంక, వీరవరం వీఆర్వోల సమక్షంలో ఆబోతుకు పోస్టుమార్టం నిర్వహించారు. పరీక్షలు నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామని తెలిపారు.

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ

సీపీఐ వర్క్‌షాపులో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎంసీ వెంకటేశ్వర్లు అన్నారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న సీపీఐ జిల్లా కార్యకర్తల వర్క్‌షాపు రెండో రోజైన గురువారం జరిగిన సమావేశంలో కులం, వర్గం, సామాజిక న్యాయం అనే అంశాలపై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజాన్ని మార్చడమే కమ్యూనిస్ట్ పార్టీ అంతిమ లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్య విప్లవం రావాలని, సామాజిక న్యాయం జరగాలని ఆకాంక్షించారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ దేశానికి ఆర్ఎస్ఎస్ ప్రమాదకారి అని, దేశ సంపద అన్ని వర్గాల ప్రజలకు అందాలని అన్నారు. సమాజంలో ఆరుశాతం ఉన్న అగ్రవర్ణ కులాలు పాలన చేస్తుంటే, 94 శాతంగా ఉన్న కులాలు పాలితులుగా ఉండిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు శిక్షణా తరగతులను పర్యవేక్షించారు.ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ముప్పన కుమార్ అధ్యక్షత వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పోలవరం 11 కెవీ కెనాల్ ఫీడర్ వర్క్ నిమిత్తం ఈ నెల 7న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. మధ్యాహ్నం 1గం. నుంచి సాయంత్రం 6 గం. వరకు పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, అచ్చియ్యపాలెం, చీపురుపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

పుష్కరాలకు రూ.1500 కోట్లు కావాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027ను వైభవంగా నిర్వహించేందుకు శాఖల సమన్వయం కోసం ఒక నోడల్ అధికారిని నియమించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం మాట్లాడారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పర్యాటక,నగర పాలక సంస్థ, విద్యుత్‌శాఖల సమన్వయం చాలా అసరమన్నారు. ఇప్పటి నుంచి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. పుష్కరాలకు రూ.1500 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. పుష్కరఘాట్ల అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం రూ.48 కోట్లు కేటాయించిందన్నారు.హేవ్‌లాక్ బ్రిడ్జిని టూరిజం డెస్టినేషన్ పాయింట్ కింద చేసుకున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజమహేంద్రవరం నుంచి పరిసర ప్రాంతాలకు టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా గోదావరిలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్‌కు విద్యుత్ సరఫరా లేక జనరేటర్‌కు రోజుకు రూ.20 వేలు ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారన్నారు.రెస్టారెంట్ నిర్వాహకుల కు ప్రభుత్వం నుంచి సహకారం ఉంటే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు.

ధాన్యం కొనుగోళ్లపై నిబంధన సడలించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



అనపర్తి,మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనాల దృష్ట్యా జిల్లా పరిధిలోనే కాకుండా వీలున్న చోట ధాన్యం విక్రయించుకునే విధంగా నిబంధన సడలించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం జరిగిన శాసన సభలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు చెల్లించడానికి సుమారు ఎనిమిది నెలల కాలం పట్టేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 48 గంటల్లో రైతులకు సొమ్ములు చెల్లిస్తున్నామన్నారు.ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్‌ల విజయమని అన్నారు. గత ప్రభుత్వం వదిలి పెట్టిన రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు కూటమి ప్రభుత్వం చెల్లించడం అభినందనీయమని అన్నారు. 2024 ఖరీఫ్‌లో 5.5 లక్షల మంది రైతులకు రూ.7564 కోట్ల ధాన్యం సొమ్ములు 48గంటల్లో చెల్లించడం కూటమి ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమను తెలిపిందన్నారు.రైతులు జిల్లా పరిధిలోనే విక్రయించుకోవాలన్న నిబంధనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గతంలోనే ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చానని కానీ ఆచరణలోకి రాలేదన్నారు. ఈ దాళ్వా సీజన్‌లో నిబంధనను సడలించాలని కోరారు.

రేపటి నుంచి పి4 సర్వే

» 18 నాటికి పూర్తిచేయాలి
» 21న గ్రామ సభల్లో జాబితా ప్రదర్శించాలి
» జిల్లా కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాను ప్రగతి పథంలో ముందుకు నడిపేందుకు పి4 విధానాన్ని ఈ నెల 8వ తేదీ నుంచి సమర్థవంతంగా చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి పి4పై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వం, ప్రయివేటు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం కోసం మార్చి 8నుంచి క్షేత్ర స్థాయిలో సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళి మేరకు రెండో దశలో మన జిల్లాలో సర్వే జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా 10 రోజుల వ్యవధిలో సర్వే పూర్తిచేయాలన్నారు. గ్రామంలో పేదల్లో పేదలు 20 శాతం మంది, ఆర్థికంగా అభివృద్ధి చెందిన 10శాతం మందిని సర్వే ప్రక్రియలో గుర్తించి వారి వివ రాలు నమోదు చేయాలన్నారు. ఎంపిక విధానం లో నిర్లిప్త ధోరణితో వ్యవ హరించరాదని స్పష్టం చేశారు. మునిసిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ శిక్షణ పూర్తిచేశామన్నారు. విజన్-2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన 10 ప్రాధాన్యత అంశాలను గుర్తించి తగిన విధంగా కార్యాచర ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, సాంకేతిక పరమైన అంశాలపై డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 18 నాటికి సర్వే పూర్తిచేసి 21 నాటికి గ్రామ సభల్లో జాబితా ప్రదర్శించాలన్నారు. మార్చి 30న ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఖచ్చితత్వం కలిగిన పనితీరును ప్రణాళికా ప్రకారం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవో వీణాదేవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎముకల పటుత్వ పరీక్షలు తప్పనిసరి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఎముకల పటుత్వ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్ ఫార్మ కంపెనీ సహకారంతో ఉచిత బోన్స్ డెన్సిటీ పరీక్షలు, నెఫ్రోప్లస్ రక్త క్రియాటిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వారి ఇళ్లల్లో ఎక్కువగా శ్రమపడుతుంటారని, కుటుంబ ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ తమ ఆరోగ్యం విషయంలో చూపించరని అన్నారు. ఎముకలు బలంగా ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి పటుత్వ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మాట్లాడుతూ ఆసుపత్రిలోని వైద్యులకు, సిబ్బందికి, రోగులకు ఉచితంగా ఈ పరీక్షలు చేసినట్టు తెలిపారు. 200 మందికి పరీక్షలు చేశారని, రిపోర్ట్‌ల ప్రకారం మందులు, ఇతర వైద్య సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ ఎన్‌పీ పద్మశ్రీరాణి, బోధనాసుపత్రి వైద్యులు, సిబ్బంది, సన్‌ఫార్మ ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం అంబరాన్నంటాలి

సన్నాహక ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల



వీరమహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల దంపతులు

రాజానగరం, మార్చి 6 ఆంధ్రజ్యోతి: ఈ నెల 14న జరుగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవం అంబరాన్నంటేలా అధిక సంఖ్యలో పిఠాపురం తరలిరావాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆకాంక్షించారు. జనసేన సన్నాహక ఆత్మీయ సమావేశం రాజానగరంలోని రాయల్ కన్వెన్షన్ హాల్లో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత జరుపుకునే మొట్టమొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సవంలా జరిపించాలని జనసేనాని పవన్‌కల్యాణ్, పార్టీ పెద్దలు నిర్ణయించారని, దీనిని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీనిధి జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన జనసేన వీరమహిళ, మహిళా సాధికార మండలాధ్యక్షురాలు నంద్యాల లక్ష్మిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన మహిళా సమాఖ్య సీతానగరం మండలాధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు సత్కరించారు. ఇద్దరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

86 సీసీ రోడ్లకు రూ.10.16కోట్ల నిధులు

అనపర్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 86 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.10.16కోట్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అనపర్తిలో 30 రోడ్లకు రూ.3.53 కోట్లు, బిక్కవోలులో 33రోడ్లకు రూ.3.44 కోట్లు, రంగంపేటలో 23 రోడ్లకు రూ.3.18 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులతో ఆయా మండలాల్లో రోడ్ల నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

డ్రీమ్స్ స్కూల్లో క్రీడోత్సవం

ధవళేశ్వరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో ముందు ఉండాలని సీఐ టి.గణేష్ పేర్కొన్నారు. డ్రీమ్స్ స్కూల్లో గురువారం నిర్వహించిన క్రీడోత్సవం-25 బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. క్రికెట్, రన్నింగ్, త్రోబాల్, కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్ సంధ్యాకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

కడియం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. నెల రోజులుగా అల్పాహారాన్ని ఏర్పాటు చేసిన నానిని సత్కరించారు.

విద్యార్థులకు పోలీసుల ఓపెన్ హౌస్



విద్యార్థినులకు మహిళా చట్టాలను వివరిస్తున్న ఏఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఓపెన్ హౌస్, ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఓపెన్ హౌస్‌లో పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్, కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, ఎల్‌హెచ్‌ఎంఎస్, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాలు, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, క్లూస్ టీం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వీయరక్షణ మెళకువలు, మానసిక, శారీరక దృఢత్వం, పోక్సో, మహిళా చట్టాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలను బాధ్యతగా ఉపయోగించడం, సామాజిక బాధ్యత, హెల్ప్‌లైన్ నెంబర్లు, మహిళా రక్షక్ తదితర అంశాలను అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ వివరించారు.

సీతానగరం: స్థానిక జ్ఞాననిధి విద్యానికేతన్ విద్యార్థినులకు పోలీస్ వ్యవస్థ పనితీరుపై ఎస్ఐ రామ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వైర్‌లెస్ కమ్యూనికేషన్ సిస్టమ్ ఎలా పనిచేస్తుందో విద్యార్థులతో మాట్లాడించి అవగాహన కల్పించారు. ఖైదీల సెల్, అనుకోని ప్రమాదం ఎదురైనప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు.

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ పోలీసుల విధులు, ఆయుధాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, ఈవ్‌టీజింగ్ చేస్తే విధించే శిక్షలను తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మాజీ ఎంపీ భరత్‌రామ్ చుట్టూ వాళ్లు 420లే'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ భరత్‌రామ్ చుట్టూ ఉండే వారంతా నేరచరిత్ర కలిన 420లేనని టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు కూడా నేరప్రవృత్త కలిగిన వారినే మార్గాని భరత్‌రామ్ తన చట్టు తిప్పుకుటుంన్నాడని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. సమస్యలపై నోరుమెదపని భరత్‌రామ్ శవ రాజకీయలు మాత్రం చేయడానికి ముందుకు వచ్చేస్తాడన్నారు. రౌడీ షీటర్లను, చైన్ స్నాచర్లకు, ఆడవాళ్లను ట్రాప్ చేసి లేపుకునిపోయేవారు, కత్తులు తిప్పుకుంటూ మహిళలను భయపెట్టేవారిని వెంటపెట్టుకుని భరత్‌రామ్ తిరుగుతున్నారని అన్నారు.

ధనమ్మ ఆలయ వార్షికోత్సవం

సీతానగరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలమపేటలో ధనమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారెను, కలశాలను మహిళలు నెత్తిన పెట్టుకుని ఊరేగించారు. అనంతరం సారెను అమ్మవారికి సమర్పించారు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోరుకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడిలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన అకీర హాస్పిటల్ సారధ్యంలో పలువురికి కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ అడపా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది.

డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల

ధవళేశ్వరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతు అవసరాల మేరకు డెల్టా కాలువలకు సాగు నీటి విడుదలను పెంచి విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ నుంచితూర్పుడెల్టాకు 2850క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1800క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5000క్యూసెక్కులు చొప్పునమొత్తం 9650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 9,496 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.80అడుగులుగా నమోదయింది.

గోకవరంలో జాబ్‌మేళా

గోకవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కోళ్ళ వీరాస్వామి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు సుమారు 200మంది నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరైనట్టు ప్రిన్సిపాల్ పీవీవీ ప్రసాద్ తెలిపారు. ప్రముఖ కంపెనీలైన ఫాక్స్ కాన్ మాన్యు ఫ్యాక్చరింగ్ కంపెనీ, జీజే సొల్యూషన్స్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 35 మందిని ఎంపిక చేసినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తాడితోట్ బ్రాంచ్ ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కటారి నగర్‌లో గురువారం జరిగిన ఈ వేడుకలో సెంట్రల్ జైలు మెడికల్ సూపరింటిడెంట్ డాక్టర్ పి.కోమలి, తాడితోట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు జి పుష్పాంజలి, మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగుకుమారి, ఉపాధ్యాయురాలు వివిఎస్ రాధాకుమారిలను ఘనంగా సత్కరించారు. అనంతరం గంగ ఎమర్జెన్సీ అండ్ మల్టీ స్పెషాలిటీ (జెమ్స్) ఆసుపత్రి వైద్య శిబిరం నిర్వహించి 150 మందికి షుగరు, బీపీ పరీక్షలు చేశారు.

భూమికి పట్టాలు మంజూరు చేయాలి

గోకవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా బృందం తహశీల్దారు సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూమి సాగు చేసుకుంటున్న సాగుదారుల పేర్లు తహశీల్దారుకు అందించారు. సంబంధిత భూమి కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక ర్యాలీలు, రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించినట్టు బృంద సభ్యులు వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.సతీష్, కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, జాన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత వార్షికోత్సవాలు ప్రారంభం



రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి గట్టున శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితిలో సంగీత వార్షికోత్సవాలను సెక్రటరీ విశ్వనాథం భాస్కరరామ్ గురువారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆకెళ్ల సుబ్బారావు సౌజన్యంతో ఏర్పాటు కాబడిన పెద్దేహపు సాయిబాబా బృందం నాదస్వరం, తదుపరి పంచరత్న సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో వీవీ రమణారావు, సీహెచ్‌ఎస్ వెంకటరావు, జేవీ రమణారావు, ముత్తంగా బుచ్చిరామయ్య, జోస్యుల సరస్వతి పాల్గొన్నారు.



అప్పుడే.. భగభగ

మండిపడుతున్న భానుడు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భానుడు మండిపడుతున్నాడు..భగభగలాడిపోతున్నాడు.. జనం తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు.. 10 గంటలు దాటిన తరువాత బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ గురువారం ఉష్ణోగ్రతల వివరాలు వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో గురువారం 40.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది.చింతూరులో 38.5 నమోదైంది. శుక్రవారం 38.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. దేవీపట్నంలో 42.5 డిగ్రీలు నమోదు కాగా శుక్రవారం 39.0 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. గంగవరంలో 41.3 డిగ్రీలు నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. రంపచోడవరంలో 41.9 డిగ్రీలు నమోదైంది. శుక్రవారం 38.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో గురువారం 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గోకవరంలో 40.0 గోపాలపురంలో 40.0 , కడియంలో 37.0,కోరుకొండలో 40.0, కొవ్వూరులో 39.3, నల్లజర్లలో 39.1 , నిడదవోలులో 39.8, పెరవలిలో 38.3, రాజమహేంద్రవరంలో 39, రూరల్‌లో 38.9, రాజానగరంలో 37.8, రంగంపేటలో 37.2, సీతానగరంలో 40.8, తాళ్ళపూడిలో 40.3, ఉండ్రాజవరంలో 38.9 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గనున్నది. కాకినాడ జిల్లా జగ్గంపేటలో 38.0 డిగ్రీలు, కాజులూరులో 37.3, కోటనందూరులో 38.2 , పెద్దాపురంలో 37.8, పిఠాపురంలో 36.7 , సామర్లకోటలో 37.5, తునిలో 38.2, కోనసీమ జిల్లా ఆలమూరులో 37.8 డిగ్రీలు, అంబాజీపేటలో 37.6, ఆత్రేయపురంలో 38.3, కొత్తపేటలో 37.5, పి గన్నవరంలో 37.4, రావులపాలెంలో 37.8డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదైంది. శుక్రవారం ఒకటి నుంచి రెండు డిగ్రీల తగ్గే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ స్పష్టం చేసింది.

విషాద..జర్నీ!



మృత్యు శకటం



ప్రమాదంలో తునాతునకలైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

అతి వేగం ప్రమాదం.. అయినా ప్రైవేట్ ట్రావెల్ బస్ డ్రైవర్లు ఎక్కడా తగ్గరు.. వేగంగా దూసుకుపోతారు.. ఎదురుగా ఏం ఉన్నా పట్టించుకోరు..చివరకు బలైపోతారు.. ఏలూరు చొదిమెళ్ల దగ్గర గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదమే అందుకు ఉదాహరణ.. రమణ ట్రావెల్స్ బస్ బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కాకినాడకు 34 మంది ప్రయాణికులతో బయలుదేరింది.. డ్రైవర్ వేగంగా వస్తున్నాడు.. ప్రయాణికులంతా నిద్రలో ఉన్నారు.. రోడ్డు మధ్యలో లారీ రూపంలో మృత్యుశకటం ఆగిపోయింది.. అయినా ప్రైవేట్ బస్ డ్రైవర్ అంచనా వేయలేకపోయాడు.. వెనుక నుంచి వేగంగా ఢీకొట్టాడు.. అతివేగం.. నిర్లక్ష్యం డ్రైవర్ సహా ముగ్గురి ప్రాణాలు తీసింది.. వీరిలో కాకినాడ జిల్లాకు చెందిన వారే ముగ్గురు ఉండడం తీవ్ర విషాదంలో నింపింది.

- మెయిన్‌లో

స్వగృహమస్తు!



పేదింటికి కూటమి చేయూత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పేదింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. వీరి సొంతింటి కలను తీర్చేందుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పేదలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు 23,359 మంది దరఖాస్తులు గృహనిర్మాణశాఖకు చేరాయి. గడువు ముగియనున్న ఈ నెలాఖరునాటికి మరో పది వేల వరకు వినతులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18 వేలు, తూర్పు గోదావరి జిల్లాలో 10,559, కోనసీమ జిల్లాలో 4,800 వరకు దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఈ నెల 10వ తేదీ నుంచి వడపోత పోయడానికి గృహ నిర్మాణశాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల లబ్ధిదారులుగా ఉన్నట్టు తేలితే అర్హుల జాబితా నుంచి తప్పించనున్నారు. వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో 95 శాతం మందికిపైగా సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారే. ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలాలు ఉన్నట్టు నిర్ధారించేలా ఆయా మండలాల తహశీల్దార్ల నుంచి గృహనిర్మాణశాఖ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు సేకరిస్తున్నారు. మరో పక్క లబ్ధిదారులుగా ఎంపికైన వారి సొంతింటి నిర్మాణానికిప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది.

నాడు పేదల పేరు..దోపిడీ జోరు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పేదలను నిలువునా ముంచేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.06 లక్షల మందిని పేదల ఇళ్లస్థలాలకు అర్హులుగా గుర్తించింది. వీరందరికి 7,610 ఎకరాలు అవసరమవుతాయని నిర్ధారించారు. ఇందులో రెండు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగిలిన 5,610 ఎకరాల ప్రైవేటు భూములను రూ.2,200 కోట్లకుపైగా వెచ్చించి కొనుగోలు చేసింది. ఈ క్రమంలో పేదల ఇళ్లస్థలాలకు అనువైన ప్రాంతాలు కాకుండా కేవలం స్థానిక అధికార పార్టీ నాయకులకు ఆర్థికంగా కలిసి వచ్చే ప్రాంతాలను గుర్తించి వాటిని అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,540 వరకు లేఅవుట్లు వేశారు. ఇందులో వెయ్యికిపైగా లేఅవుట్ల వరకు వర్షాలకు నిండా మునిగిపోయేవే. 150 ఎకరాల కరప సెంట్రల్ లేఅవుట్ దగ్గర నుంచి, జగన్ ప్రారంభించిన కొమరగిరి లేఅవుట్, రాజమహేంద్రవరానికి సమీపంలోని ఆవభూములు ఇలా చాలా వరకూ పనికిరాని లేఅవుట్లు వేశారు. వీటిలోనే లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.అయినా ఆ లేఅవుట్లలో స్థలాలు మాకొద్దంటూ పేదలు భీష్మించడంతో లక్షలాది స్థలాలు ఖాళీగా ఉండిపోయాయి. ఇన్ని చేదు అనుభవాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను నెరవేర్చే విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు కదులుతోంది. దానిలో భాగంగా సొంతిళ్లు కట్టుకోవాలనుకునే లబ్ధిదారులకు ఆర్థికంగా సాయం అందించేందుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుంది.తొలుత సొంత ఇంటి స్థలం ఉన్న వారికి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపింది. సొంత స్థలం లేనివారికి స్థలం సేకరించి ఇవ్వడానికి కసరత్తు చేస్తోంది.

ఇప్పుడు ఎక్కువ మంది వారే..

కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సచివాలయాల ద్వారా అధికారులు సొంతింటి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు చివరలో ప్రారంభించిన ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23,359 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు 18 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1,700 మంది వివిధ మునిసిపాలిటీల పరిధిలో దరఖాస్తు చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 10,559 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా నల్లజర్ల మండలంలో 2,396 మంది,గోపాలపురం 1,143, రాజానగరం మండలంలో 1,060 మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెలాఖరు వరకు చాన్స్ ఉండడంతో మరో పది వేల వరకు దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో 95 శాతం మంది సొంతంగా ఇంటి స్థలం ఉన్నవారే.ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలం ఉన్నట్టు ఆయా మండలాల తహశీల్దార్లతో పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్‌ను అధికారులు తీసుకుంటున్నారు.ఇప్పటికే సగం దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ముగిసింది.

- సొంతింటి కోసం దరఖాస్తులు
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో వెల్లువ
- ఇప్పటి వరకు 23,359 దరఖాస్తులు
- 95 శాతం సొంతస్థలం ఉన్నవారే
- సచివాలయాల ద్వారా స్వీకరణ
- ఈ నెలాఖరు వరకు ఛాన్స్
- తహశీల్దార్ల ద్వారా పొజిషన్ సర్టిఫికెట్
- ఈ నెల 10 నుంచి వడపోత
- లబ్ధిదారుకు రూ.2.50 లక్షలు
- గతంలో ఇళ్లు పొందితే ఏరివేత
- సొంత స్థలం లేనివారికి స్థలం

10 నుంచి యాప్‌లో వివరాలు..

ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన యాప్‌లో ఈనెల 10 నుంచి అధికారులు వివరాలు నమోదు చేయనున్నారు. గతంలో వీరు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభుత్వం నుంచి స్థలం లేదా ఇళ్లు పొంది ఉన్నారా?లేదా?అనేది గుర్తించనున్నారు. ఒకవేళ పాత లబ్ధిదారుడైతే అర్హుల జాబితా నుంచి తొలగించనున్నారు.మరో పక్క అర్హుల జాబితాకు సంబంధించి వడపోత పూర్తయితే వాటిని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్, పట్టణం, గ్రామీణ ప్రాంతం విభాగంలో అప్‌లోడ్ చేయనున్నారు. లబ్ధిదారుడు పథకానికి అర్హత సాధిస్తే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది. ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు. ఈ నేపథ్యంలో ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సొంతింటి స్థలం లేని పేదల దరఖాస్తులను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను బట్టి ఎంత భూమి సేకరించాల్సి ఉంటుందనే దానిపై అంచనాకు వచ్చి స్థల సేకరణపై దృష్టిసారించనున్నారు.



తప్పదు మా గురి!

ఎక్కడైనా.. ఎప్పుడైనా తప్పదు మా గురి అంటున్నారు మహిళా అధికారిణులు.. మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో గురువారం క్రీడా పోటీలు ప్రారంభించారు.. కాకినాడలో ఒక మహిళా ఉద్యోగి జావెలిన్ త్రో లక్ష్యంపై పెట్టిన గురి చూస్తే షాకవాల్సిందే మరి..

- 8లో



మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ తీస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

లక్కీ..గీత!

గీత కార్మికులకు 13 షాపులు కేటాయింపు

రాజమహేంద్రవరం/అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ గురువారం పూర్తయింది. మద్యం పాలసీ 2024-26కి సంబంధించి గీత కులాలకు 10 శాతం షాపులను కేటాయిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ మేరకు జిల్లాలో 13 షాపులను కేటాయించారు. వీటికి సంబంధించి 387 మంది దరఖాస్తు చేస్తున్నారు. దీంతో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ పర్యవేక్షణలో అసిస్టెంట్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ వినీష ఆధ్వర్యంలో ప్రక్రియను పూర్తి చేశారు. షాపులను లాటరీలో చేజిక్కించుకున్న వారు వెంటనే లైసెన్సు ఫీజు చెల్లించడంతో ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేశారు. వాళ్ల షాపులను ఏర్పాటు చేసుకున్న తర్వాత తగు తనిఖీల అనంతరం రెండేళ్లకు లైసెన్స్‌లు జారీ చేస్తారు. కాగా.. గీత కులాల వారికి మద్యం షాపుల లైసెన్సు ఫీజులో 50 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తూ మరో వరం ఇచ్చింది. దీంతో గీత కులాల వారి మాటున ఇతరులు రంగంలోకి దిగారని తెలుస్తోంది.అదే జరిగితే ప్రభుత్వ ఉద్దేశం నీరుగారే పరిస్థితి వస్తుందనే ఆరోపణలున్నాయి.

పర్యాటక పెట్టుబడులకు ఏపీ అనుకూలం

జర్మనీ పర్యటనలో మంత్రి దుర్గేశ్

రాజమహేంద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూల మని, పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ జర్మనీ పర్యటనలో పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు. బెర్లిన్ సదస్సులో మూడో రోజున ఏపీ స్టాల్ వద్ద మంత్రి దుర్గేశ్, టూరిజం ఎండీ ఆమ్రపాలి వివిధ దేశాల ప్రతినిధులకు రాష్ట్ర పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. నూతన పర్యాటక పాలసీ, రాష్ట్ర పర్యాటక ప్రాంతాల సమగ్ర సమాచార పుస్తకాన్ని అందజేశారు.అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులకు తమ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని భావిస్తోందని పేర్కొన్నారు.పెట్టుబడిదారులకు అన్ని విధాలా అనుకూలమైన వాతావరణం ఏపీలో ఉందని, పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని మంత్రి కోరారు.



తడిచెత్త, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతామణి

ఐవీఆర్‌ఎస్‌కు 150 పంచాయతీలు ఎంపిక

డీపీవో శాంతామణి

కడియం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం)కు జిల్లా వ్యాప్తంగా 150 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారని డీపీవో వి.శాంతామణి తెలిపారు.మండలంలోని కడియం, జేగురుపాడు, మురమండ, వేమగిరి, దుళ్ళ, వీరవరం, కడియపుసావరం గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. ఈ నెల మూడో వారం నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఆయా గ్రామాల్లో ఇంటి యజమానులకు ఫోన్ చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతోంది ? చెత్త నుంచి సంపద కేంద్రం పనితీరు ఎలా ఉంది ? అనే అంశాలను ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత గ్రామ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎం.నాగలత, ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, గ్రేడ్ 1 కార్యదర్శులు ఎం.రూప్‌చంద్,శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఆర్.సత్యనారాయణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



లక్ష్యం ఉండాలి.. గురి పెట్టాలి!

ఇదేంటో తెలుసా.. ఇంకేంటి గన్ టక్కున చెప్పింది ఒక విద్యార్థిని..అది విన్న పోలీస్ ఆశ్చర్యపోయాడు.. నీకెలా తెలుసమ్మా అన్నాడు.. అదేంటి సార్.. ప్రతి సినిమా లోనూ చూస్తున్నాగా అంటూ సెలవిచ్చింది.. అది విన్న పోలీస్.. ఇది సినిమాలోలా డమ్మీ గన్ కాదమ్మా.. నిజమైన గన్.. ఒక్కసారి ట్రిగ్గర్ నొక్కామా అంతే.. అంటూ విద్యార్థినులకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయుధాలు ఎలా వాడాలి.. ప్రమాదం వస్తే ఎలా ఎదుర్కొనాలి అనే అంశాలపై ఇలా మేల్కొలిపారు. - రాజమహేంద్రవరం

రేపు మహిళా దినోత్సవం విభిన్నంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఈ సారి విభిన్నంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిశ్రమలు,డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలతో విజయగాథలు, ఆర్థిక చేకూర్పు కార్యక్రమాలను పోలీస్ శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు.స్థానిక ప్రజాప్రతినిధులను వేడుకకు ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులు, పారిశ్రామికవేత్తల సన్మాన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు 3593 కుట్టు మిషన్లు

రాజమహేంద్రవరం, మార్చి6(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లు ఇవ్వడంతో పాటు, నిష్ణాతులతో శిక్షణ ఇస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల మహిళలకు కుట్టుమిషన్లు ఇస్తారన్నారు. ఎంపిక చేసిన వారికి నిష్ణాతులతో 45 రోజుల నుంచి 90 రోజుల వరకూ శిక్షణ ఇస్తామన్నారు. శనివారం నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తారన్నారు.జిల్లాలో బీసీలకు 1456, కాపులకు 802, కమ్మ వర్గీయులకు 318, రెడ్లకు 303, ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ)లకు 164, ఆర్యవైశ్యులకు 177, బ్రాహ్మణులకు 232, క్షత్రియులకు 141.. మొత్తం 3593 కుట్టు మిషన్లు ఇస్తారన్నారు. 18ఏళ్ల నుంచి 50ఏళ్లలోపు మహిళలు అర్హులని, బియ్యం కార్డు ఉండాలని, కులధ్రువీకరణ పత్రం కూడా ఉండాలని ,ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఉండాలని చెప్పారు. అర్హులు మండల, మునిసిపాలిటీ, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనధికార ర్యాంపులు.. గోదావరి గట్టుకు తూట్లు

● చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు బీజేపీ నేతల ఫిర్యాదు


తహశీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాల పరిధిలో గోదా వరి గట్టు మీద కొంతమంది ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడ ర్యాంపులను జేసీబీలతో తయారు చేస్తున్నారు. ఈ మేరకు బీజేపీ నేతలు గురువారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై బీజేపీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ మాట్లాడుతూ బల్లిపాడు నుంచి తాడిపూడి వరకు గల గోదావరి ఏటిగట్టు వెంబడి ఎవరికివారు ఇష్టానుసారం ఇసుక కోసం ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో ఏటిగట్టు పటిష్టత దెబ్బతిని గోదావరి పోటెత్తినప్పుడు గట్టుకు గండ్లు పడి ఆస్తి, ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో అధికసంఖ్యలో భక్తులు స్నానఘట్టాలకు రానున్నారు. ఒకవేళ లోతు ఎక్కువగా ఉంటే అందులో దిగినప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇందుకు మహాశివ రాత్రి రోజున తాడిపూడిలోని ఇసుక ర్యాంపులో జరిగిన ప్రమాదమే నిదర్శనమన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఆర్డీవో, ఇరిగేషన్ శాఖ వారికి వినతిపత్రాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, గోకవరపు జితేంద్ర రవి, పడిందల లింగాచారి, కలిశెట్టి సన్యాసి నాయుడు, బీజేవైఎం పీ. సత్యనారాయణ, మల్లిపూడి రాజేష్ కిసాన్ మోర్చా కే. సత్యనారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలకు

కులధ్రువీకరణ పత్రాలు అందించాలి


జవహర్‌ను సత్కరిస్తున్న బేడ, బుడగ జంగాల రాష్ట్ర నేతలు

కొవ్వూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బేడ, బుడగ జంగాలకు కులధ్రువీకరణ పత్రాలు అందించకపోవడంతో పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారయ్యిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు అన్నారు. గురువారం కొవ్వూరులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి కేఎస్ జవహర్‌ను కలిశారు. అనంతరం మధు మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడం వల్ల బేడ, బుడగ జంగాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై జవహర్ స్పందిస్తూ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానిని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జవహర్‌ను ఆ సంఘ నాయకులు శాలువాను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బేడ, బుడగ జంగాల సంఘం జిల్లా కార్యదర్శి కప్పుకి వెంకన్న ముగ్గు వెంకటేష్, కప్పిరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : ఏవో


రైతులతో మాట్లాడుతున్న ఏవో గంగాధర్

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏవో ఏ. గంగాధర్ అన్నారు. గురువారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత, నియమ నిబంధనల గురించి వివరించారు. ఈ చట్టం ద్వారా ప్రతి రైతు ప్రభుత్వ పథకాలు, ఇతర సమాచారాన్ని పొందటానికి వీలుంటుందన్నారు. వ్యవసాయశాఖ సీనియర్ అసిస్టెంట్ కృష్ణప్రియ, ఉద్యాన, వ్యవసాయ శాఖల సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాలకు రూ.1500 కోట్లు కావాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027ను వైభవంగా నిర్వహించేందుకు శాఖల సమన్వయం కోసం ఒక నోడల్ అధికారిని నియమించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం మాట్లాడారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పర్యాటక,నగర పాలక సంస్థ, విద్యుత్‌శాఖల సమన్వయం చాలా అసరమన్నారు. ఇప్పటి నుంచి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. పుష్కరాలకు రూ.1500 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. పుష్కరఘాట్ల అభివృద్ధికి ఇప్పటికే కేంద్రం రూ.48 కోట్లు కేటాయించిందన్నారు.హేవ్‌లాక్ బ్రిడ్జిని టూరిజం డెస్టినేషన్ పాయింట్ కింద చేసుకున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజమహేంద్రవరం నుంచి పరిసర ప్రాంతాలకు టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా గోదావరిలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్‌కు విద్యుత్ సరఫరా లేక జనరేటర్‌కు రోజుకు రూ.20 వేలు ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారన్నారు.రెస్టారెంట్ నిర్వాహకుల కు ప్రభుత్వం నుంచి సహకారం ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

ఉండ్రాజవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం, మోర్త సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్ఎస్ అప్పారావు తెలిపారు. దమ్మెన్ను, చిలకపాడు, మోర్త, సత్యవాడ, ఉండ్రాజవరం విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై నిబంధన సడలించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



అనపర్తి,మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనాల దృష్ట్యా జిల్లా పరిధిలోనే కాకుండా వీలున్న చోట ధాన్యం విక్రయించుకునే విధంగా నిబంధన సడలించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం జరిగిన శాసన సభలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్ములు చెల్లించడానికి సుమారు ఎనిమిది నెలల కాలం పట్టేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 48 గంటల్లో రైతులకు సొమ్ములు చెల్లిస్తున్నామన్నారు.ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్‌ల విజయమని అన్నారు. గత ప్రభుత్వం వదిలి పెట్టిన రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు కూటమి ప్రభుత్వం చెల్లించడం అభినందనీయమని అన్నారు. 2024 ఖరీఫ్‌లో 5.5 లక్షల మంది రైతులకు రూ.7564 కోట్ల ధాన్యం సొమ్ములు 48గంటల్లో చెల్లించడం కూటమి ప్రభుత్వానికి రైతులపై ఉన్న ప్రేమను తెలిపిందన్నారు.రైతులు జిల్లా పరిధిలోనే విక్రయించుకోవాలన్న నిబంధనతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని గతంలోనే ఈ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చానని కానీ ఆచరణలోకి రాలేదన్నారు. ఈ దాళ్వా సీజన్‌లో నిబంధనను సడలించాలని కోరారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ బయలు దేరిన ఆశావర్కర్లనుఅక్రమంగా నిర్బంధించడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందరబాబు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అందించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు బయలు దేరారన్నారు. రాష్ట్రప్రభుత్వంతో చర్చలు జరిగి ఒప్పందం కాపీ విడుదల చేసి సంవత్సరం దాటినా, నేటికీ ఎటువంటి జీవోలు విడుదల చేయలేదన్నారు. మెటర్నీటీ సౌకర్యం, బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్‌మెంటు వయసు 62 సంవత్సరాలకు పెంచుతూ జీవో విడుదల చేయాలన్నారు. సీఐటీయూ నేతలు ఉన్నారు.

దేవరపల్లి: ఛలో విజయవాడ కార్యక్రమానికి గురువారం వెళ్తున్న ఆశ వర్కర్లపై ప్రభుత్వం నిర్బంధం విధించ డాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారందరినీ దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించటం అన్యాయమన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఐనపర్తి శ్రీనివాసరావు, కే.రత్నాజీ, ఆశవర్కర్ల యూనియన్ నాయకులు కొర్లపాటి ఇందిరా, టీ.మోదమ్మ, ప్రసన్న, కే.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.


నల్లజర్లలో ఆశా వర్కర్లను దించుతున్న పోలీసులు

నల్లజర్ల: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళుతున్న ఆశా వర్కర్లను నల్లజర్ల పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు బస్సుల్లో దేవరపల్లి, నల్లజర్ల మండల అనంతపల్లి నుంచి 18 మంది వెళుతుండగా అదుపులోకి తీసుకుని, గంట తరువాత తిరిగి పంపించేశారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన


ఉప్పరగూడెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోపాలపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీకి ప్రజలంతా సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఉప్పరగూడెంలో తడి, పొడి చెత్త సేకరణపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత లింక్ ద్వారా నగదు మాయం.. కేసు నమోదు

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత లింక్ ద్వారా బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము దొంగిలించిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ... మండలంలోని సంగీత స్వాతికి 2024 డిసెంబరు 29వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో సెల్‌ఫోన్‌కు లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగా ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ. 49,700 రెండుదఫాలుగా కట్ అయ్యాయి. దీనిపై స్వాతి కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్‌గా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

చోడవరం రోడ్డులో వెంకన్న ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దృశ్యం

నల్లజర్ల, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావు పాలెంలోని చోడవరం రోడ్డులో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. రూ. కోటి 50 లక్ష వ్యయంతో నిర్మించినున్నట్టు వేదపండితులు శశికాంత్ వెల్లడించారు. దీనిలో భాగంగా యద్దనపూడి బ్రహ్మరాజు,బోయపాటి పెదగంగరాజు, కరుటూరి అచ్యుత రామరావు దంపతులు పూజాదికాలు చేశారు. గతంలో సాయిబాబా, శివాలయం వంటి ఆలయాల నిర్మాణం తరువాత, మళ్లీ ఇప్పుడు స్వామివారి ఆలయం నిర్మించడం ఆనందంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.

ఉత్తర్వుల ఉపసంహరణపై హర్షం

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చర్చిల అనుమతులపై విచారణ చేపట్టాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవడంపై మాలసంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ గురువారం హర్షంవ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జారీచేసిన ఉత్తర్వులను 5వ తేదీన పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ కే. ఆనంద్ రద్దుచేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలు కొవ్వూరులో గురువారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణ, మండలంలో 586 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 555 మంది హాజరయ్యారు, 31 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షకు 318 మందికి గాను 304 మంది హాజరవ్వగా... 14 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 194 మందికి గాను 177 మంది హాజరవ్వగా 17 మంది గైర్హాజరయ్యారు. అలాగే కుమారదేవం గురుకుల కళాశాలలో 74 మందికి 74 మంది హాజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఐ.పంగిడి, దేచర్లలో వార్షిక విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. దేచర్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఐ. పంగిడి ఇండస్ట్రియల్, 11 కేవీ ఐ.పంగిడి వాటర్‌వర్క్స్ ఫీడర్ల వార్షిక మెయింటెనెన్స్ నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. ఐ.పంగిడి, దేచర్ల ప్రజలు సహకరించాలని కొవ్వూరు రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. స్థానిక కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్

కొవ్వూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి రోజు గోదావరి పుణ్యస్నానాలకు వెళ్లి మృతిచెందిన విద్యార్థి తిరుమల శెట్టి పవన్ కుటుంబానికి ఏబీఎన్ కళాశాల విద్యార్థులు గురువారం ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామ్మోహన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు తాళ్లపూడి మండలం తాడిపూడికి వెళ్లి కుటుంబానికి విద్యార్థుల నుంచి సేకరించిన రూ. 32,700 అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్ మాట్లాడుతూ పవన్‌కు ఎంతో భవిష్యత్ ఉందని, ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి చనిపోవడం బాధాకరమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రమేష్, కామర్స్ హెడ్ కోడూరి రామకృష్ణ, సిహెచ్ దయాకర్, థామస్, తదితరులు పాల్గొన్నారు.


యువకుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న టీడీపీ నేత రాజీవ్‌కృష్ణ

తాళ్లపూడి: చేతికి అందివచ్చిన యువకులు ప్రమాదవశాత్తు మరణించడం చాలా బాధాకరమని టీడీపీ నేత ఎస్. రాజీవ్‌కృష్ణ అన్నారు. గురువారం ఆయన తాడిపూడికి వెళ్లి బాధిత కుటుబాలను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ. 25 వేలు చొప్పన ఆర్థికసాయం అందజేశారు. ఈయనవెంట సర్పంచ్ నామా గోపాలం నామా సురేంద్ర, సిద్దన రాధాకృష్ణ, తిరుమలశెట్టి సత్యనారాయణ, కొలుకుల వెంకన్నబాబు, పెద్దబ్బులు, వీరభద్రం, ఇమ్మని వీరశంకరం, గారపాటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

దుద్దుకూరులో కనులపండువగా శోభాయాత్ర


సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

దేవరపల్లి, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): దుద్దుకూరులో సీతారామ ఆలయ పునఃప్రతిష్ఠలో భాగంగా గురువారం ఉదయం గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శోభాయాత్ర పురవీధుల గుండా సాగింది. నిర్వాహకులు రావిపాటి వరప్రసాద్ సిద్ధాంతి మాట్లాడుతూ దుద్దుకూరులో 130 సంవత్సరాల క్రితం సీతారామ స్వామి ఆలయాన్ని నిర్మించారని, ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామ ప్రముఖులు, దాతలు రూ. రెండుకోట్ల సాయంతో ఆలయాన్ని పునఃనిర్మించినట్టు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాదాలకుంటలో పొగాకు బ్యారన్ దగ్ధం


వాదాలకుంటలో కాలిపోతున్న బ్యారన్

గోపాలపురం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): వాదాలకుంటకి చెందిన గెడా కుమారి పొగాకు బ్యారన్ గురువారం కాలిబూడిదైంది. గ్రామస్థులు తెలిపిన వివరాలివి... గెడా కుమారికి చెందిన బ్యారన్‌లో గురువారం సుమారు 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటన స్థలానికి వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశామన్నారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక అధికారి అబ్రహం తమ సిబ్బందితో వచ్చారు. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. బాధితులను ఆదుకోవాలని వారంతా కోరారు.

వెంకన్న ఆలయ హుండీ లెక్కింపు

పెరవలి,మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసిన వెంకటేశ్వరస్వామి వారి ఆలయహుండీని గురువారం లెక్కించారు. ఎండోమెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలివెన్ను గ్రూపు దేవాలయాల ఈవో పీవీ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మొత్తం 43 రోజులకు గాను ప్రధాన హుండీ ద్వారా రూ. 4,03,875 , అన్నదాన హుండీ ద్వారా రూ.8,104 ... మొత్తం రూ. 4,11,979 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

తాళ్లపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి ఎంపీడీవో కార్యాలయంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య సర్వేపై (పీ4) గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఈ సర్వేను ఈ నెల 8 నుంచి ప్రారంభించగా, 18వ తేదీ లోపు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఉగాది రోజున సీఎం పీ4 సర్వేను ఆవిష్కరిస్తారన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ జోడాల వెంకట్ మాట్లాడుతూ ఇందులో నిజమైన పేదవారెవరు అనే విషయంపై పూర్తిగా సర్వే ఉంటుందన్నారు. ట్రైనర్ ప్రసాద్ మాట్లాడుతూ 27 రకాల ప్రశ్నావళి ఉంటుందని, ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

ఉండ్రాజవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెలగదుర్రు రామాలయం ఏడో వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. చుట్టుపక్కలగ్రామాల భక్తులు పాల్గొన్నారు. దాసరి వెంకన్న, యాతం ఏసు, యాతం ఆనంద రాజు,పిండి అచ్చియ్య, దొడ్డా వెంకన్న, తదితర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కలప వాహనాలు స్వాధీనం

దేవరపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిసర ప్రాంతాల్లో పోలవరం, తాడిపూడి కాల్వగట్లపై అక్రమంగా చెట్లను నరికివేసి అక్రమంగా తరలిస్తున్న కలపను, వాహనాలను గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం, తాడిపూడి కాల్వ గట్లపై ఉన్న చెట్లు నరికి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


దేవరపల్లిలో కలప లోడును స్వాధీనం చేసుకున్న అధికారులు

విద్యార్థులకు పోలీసుల ఓపెన్ హౌస్


మహిళా చట్టాల గురించి వివరిస్తున్న ఏఎస్పీ మురళీకృష్ణ

రాజమహేంద్రవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఓపెన్ హౌస్, ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఓపెన్ హౌస్‌లో పోలీస్ స్టేషన్లలో రిసెప్షన్, కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, ఎల్‌హెచ్ఎంఎస్, బాడీ వార్న్ కెమెరాలు, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాలు, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, క్లూస్ టీం వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వీయరక్షణ మెళకువలు, మానసిక, శారీరక దృఢత్వం, పోక్సో, మహిళా చట్టాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలను బాధ్యతగా ఉపయోగించడం, సామాజిక బాధ్యత, హెల్ప్‌లైన్ నెంబర్లు, మహిళా రక్షక్ తదితర అంశాలను అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ వివరించారు.

ఉత్సాహంగా ప్రభుత్వ మహిళా ఉద్యోగినుల ఆటల పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, టెన్నీకాయిట్, స్పీడ్‌బాల్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, త్రెడ్ అండ్ నీడిల్ తదితర క్రీడలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగినులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. ఏపీజీఈఏ మహిళా విభాగం నాయకులు సీహెచ్ వీ లక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉద్యోగినిల సమస్యల పరిష్కారానికి సంఘం తమవంతు సహకారం అందిస్తోందన్నారు. మహిళా విభాగం నాయకులు అంజలిశ్రీ, సుజాత, లక్ష్మి, హైమావతి ఆయా విభాగాల మహిళా టీమ్స్‌కు నాయకత్వం వహించారు. కాగా మార్చి 8న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సెమినార్ హాలులో సాయంత్రం నాలుగు గంటలకు మహిళా దినోత్సవ సభను నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

యర్నగూడెంలో రోడ్డుకు మరమ్మతు పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గొయ్యి తవ్వుతున్న పంచాయతీ కూలీలు

దేవరపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెంలో వాటర్‌పైపు లీకేజు అనే కథనాన్ని గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనికి పంచాయతీ అధికారులు స్పందిస్తూ గోతులు తవ్వే పనులు ప్రారంభించారు. నాలుగురోడ్ల సెంటర్‌లో నీరు నిల్వ ఉండిపోవడంతో గోతుల మయంగా మారింది. దీంతో వాహనచోదకులు, బాటసారులకు ఇబ్బందులు పడతుండడంతో అధికారులు స్పందించారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని

విజయవంతం చేయండి

దేవరపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడలో ఈ నెల 14వ తేదీన జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని గోపాలపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సువర్ణరాజు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.